# విశాల భారతి

17-01-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 16




## ఆకాశంలో రంగుల జాతర

హైదరాబాద్: భాగ్యనగర ఆకాశం రంగుల హరివిల్లుగా మారి పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది. నింగిని తాకుతున్నట్లుగా తేలియాడే భారీ బెలూన్లు నగరవాసులకు కనువిందు చేస్తున్నాయి.

మిగతా 3లో..



## మేడారంకు పోటెత్తిన భక్తులు

ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా మేడారం

ఈ ఏడాది అద్భుతమైన రీతిలో ప్రారంభమైంది

భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తున్నారు

జనసందోహం ఊహించని రీతిలో పెరుగుతోంది

పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారిపోయాయి

అడవి ప్రాంతం కొత్త కళను సంతరించుకుంది

02

# మేం పాలకులం కాదు సేవకులం

## ప్రజా పాలన – ప్రగతి బాట సభలో సీఎం రేవంత్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో ప్రత్యేక అభిమానం ఉంది

జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఇది

ఆదిలాబాద్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను సిద్ధం

రూ.386.46 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జిల్లాను సస్యశ్యామలం చేసుకుందామని పిలుపు

02

'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే నాకు ప్రత్యేక అభిమానం ఉంది. జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఇది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు.అందుకే పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇస్తానని చెప్పా.'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలో నిర్వహించిన'ప్రజా పాలన – ప్రగతి బాట'బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.386.46 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.



## ధరణి దగా

ధరణి, భూ భారతి భారీ రిజిస్ట్రేషన్ కుంభకోణం

వరంగల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు

జనగామ, యాదాద్రి జిల్లాల్లో కేంద్రీకృతమైన స్కామ్

ఆదిలాబాద్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను సిద్ధం

రూ. 3.90 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి

15 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ధరణి, భూ భారతి పోర్టళ్లను అడ్డుపెట్టుకుని సాగుతున్న ఒక భారీ రిజిస్ట్రేషన్ కుంభకోణాన్ని వరంగల్ పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని తప్పుడు మార్గంలో ఉపయోగిస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న ఒక అంతర్రాష్ట్ర ముఠా ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణం ప్రధానంగా జనగామ, యాదాద్రి జిల్లాల్లో కేంద్రీకృతమై సంచలనం సృష్టించింది. సుమారు 3.90 కోట్ల రూపాయల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ఈ ఉదంతంలో ఇప్పటివరకు 15 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ భారీ దోపిడీ వెనుక ఉన్న అసలు సూత్రధారులు పసునూరి బసవరాజు

మిగతా 2లో..

ధరణి

తెలంగాణ ప్రభుత్వం

## సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

- మెట్రో రెండో దశ పనుల విషయంలో అనిశ్చితి
- కేసీఆర్ ప్రణాళికలను పక్కనపెట్టిన ప్రభుత్వం
- పనులు కొంత ఆలస్యమయ్యాయనే విమర్శలు
- మంత్రి కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు
- పనులను వెంటనే పట్టాలెక్కించాల్సిన అవసరం ఉంది
- మెట్రో రెండో దశ పురోగతిపై కేంద్రం వైఖరి స్పష్టం

03



## బీజేపీ విజయదుందుభి

- మహారాష్ట్రలోని 28 కార్పొరేషన్లలో బీజేపీ విజయదుందుభి
- పుణే, నాగ్‌పూర్, సోలాపూర్‌లలో కమలం పార్టీకి ఘన విజయం
- థానే, కళ్యాణ్-డోంబివిలిలో పట్టు నిలుపుకున్న షిండే సేన
- కొల్హాపూర్, లాతూర్‌లలో సత్తా చాటిన కాంగ్రెస్
- చాలాచోట్ల ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ
- ఓటర్లు బీజేపీ అభివృద్ధి మంత్రానికే జై కొట్టారని స్పష్టం

02



# ఎంతకాలం విచారించాలి

ఫోన్ టాపింగ్ కేసులోసుప్రీంకోర్టు వేదికగా కీలక మలుపు

ధర్మాసనం తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది

రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది

న్యాయవాదులపై ప్రశ్నల వర్షం కురిపించింది

విచారణను ఇంకా ఎంతకాలం పొడిగిస్తుంటారని ప్రశ్నం

ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ టాపింగ్ కేసు ప్రస్తుతం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వేదికగా కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసు విచారణ తీరుపై జస్టిస్ బీవీ నాగరత్నం, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అసలు ఈ కేసు విచారణను ఇంకా ఎంతకాలం పొడిగిస్తూ ఉంటారని, ఇప్పటికే ఎన్నో సార్లు విచారణ జరిగిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులపై ప్రశ్నల వర్షం కురిపించింది. ప్రధానంగా నిందితుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరులో కేవలం వారిని జైల్లో ఉంచాలనే ఉద్దేశం కనిపిస్తోందని న్యాయమూర్తులు కుండబద్దలు కొట్టినట్లు వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు గతంలో కోర్టు ఆదేశాలను అనుసరించి విచారణకు పూర్తిగా సహకరించినట్లు ధర్మాసనం అభిప్రాయపడింది. విచారణకు సహకరించిన

మిగతా 3లో..

# దానంపై వేటు..?

తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల పర్వం

ఈ వ్యవహారం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది

స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం

ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో పెను సంచలనం

ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది

న్యాయస్థానం విధించిన గడువు ముగియనుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా సాగుతున్న ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల పర్వం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుసరిస్తున్న తీరుపై సుప్రీం కోర్టు వెలిబుచ్చిన తీవ్ర అసంతృప్తి రాష్ట్ర రాజకీయ వర్గాల్లో

మిగతా 3లో..



## ప్రభుత్వఏరియా హాస్పిటల్‌లో బేబీ మరణం

- వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటున్న తల్లిదండ్రులు
- ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లోహృదయ విధారకర సంఘటన
- బేబీని పొట్టన పెట్టుకున్నారని కుటుంబీకుల ఆవేదన
- ఆపరేషన్ చేయమని చెప్పిన వినని డ్యూటీ డాక్టర్
- డ్యూటీ డాక్టర్లు నర్సులు నిర్లక్ష్యంపై సూపర్నెంట్ కి ఫిర్యాదు
- విచారణ చేస్తానని సూపర్డెంట్ రామకృష్ణ హామీ

06

# ధరణి దగా

**మొదటిపేజీ తరువాయి**

మరియు జెల్లా పాండు అని పోలీసులు గుర్తించారు. వీరు యాదగిరిగుట్టలో ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తూ అమాయక రైతులను, భూ యజమానులను లక్ష్యంగా చేసుకున్నారు. టెక్నాలజీపై ఉన్న అవగాహనను వీరు నేరాలకు పెట్టుబడిగా మార్చుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలకమైన ప్రభుత్వ చలాన్లను తారుమారు చేయడం ద్వారా వీరు ఈ దందాకు శ్రీకారం చుట్టారు. వెబ్‌సైట్లలోని లోపాలను ఆసరాగా చేసుకుని వ్యవస్థను తప్పుదోవ పట్టించడంలో వీరు ఆరితేరిపోయారు. నేరగాళ్లు ఉపయోగించిన పద్ధతి నిజంగా దిగ్భ్రాంతి కలిగిస్తోంది. వెబ్‌సైట్‌లోని 'ఇన్‌స్పెక్ట్ ఎలిమెంట్' మరియు 'ఎడిట్ అప్లికేషన్' వంటి ఆప్షన్లను వాడుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలాన్ మొత్తాన్ని సాఫ్ట్‌వేర్ ద్వారా తగ్గించేవారు. ఉదాహరణకు వేల రూపాయలు చెల్లించాల్సిన చోట కేవలం వందల రూపాయలు మాత్రమే చూపిస్తూ సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లో మార్పులు చేసేవారు. దీనివల్ల ప్రభుత్వానికి వెళ్లాల్సిన అసలు సొమ్ము నిందితుల జేబుల్లోకి వెళ్లేది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలాంటి దుర్వినియోగం చేయడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. మరోవైపు రైతుల నుంచి మాత్రం వీరు రిజిస్ట్రేషన్ కోసం పూర్తి మొత్తాన్ని వసూలు చేసేవారు. ఇలా వసూలు చేసిన మొత్తంలో చాలా తక్కువ భాగాన్ని మాత్రమే ప్రభుత్వానికి కట్టి, మిగిలిన డబ్బును ముఠా సభ్యులు పంచుకునేవారు. ప్రభుత్వానికి తక్కువ డబ్బు కట్టినప్పటికీ, రైతులకు మాత్రం పూర్తి మొత్తం కట్టినట్లు నకిలీ రసీదులను సృష్టించి ఇచ్చేవారు. ఈ నకిలీ రసీదులు అసలైన వాటిలాగే కనిపించడంతో సామాన్య ప్రజలు తాము మోసపోతున్నామన్న విషయాన్ని ఇన్నాళ్లూ గుర్తించలేకపోయారు. ఈ ముఠా నెట్‌వర్క్ చాలా లోతుగా విస్తరించింది. కేవలం ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులే కాకుండా, స్థానిక మీ సేవ కేంద్రాలు మరియు కొంతమంది మధ్యవర్తులు కూడా ఈ దందాలో భాగస్వాములయ్యారు. వీరందరికీ 10 నుండి 30 శాతం వరకు భారీ కమిషన్లు ఆశజూపి నిందితులు తమ పనిని సులభతరం చేసుకున్నారు. స్థానిక రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ నకిలీ చలాన్లను సమర్పించి ఎలాంటి అనుమానం రాకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేయించేవారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితులు ఇప్పటివరకు సుమారు 1,080 డాక్యుమెంట్లకు సంబంధించి ఇటువంటి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు తేలింది. ఇంత పెద్ద ఎత్తున పత్రాలను తారుమారు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి ఊహించని రీతిలో నష్టం వాటిల్లింది. ఈ కుంభకోణం బయటపడటంతో యాదాద్రి జిల్లాలో 15 కేసులు, జనగామ జిల్లాలో 7 కేసులు కలిపి మొత్తం 22 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారం ఇంకా ఎంతవరకు విస్తరించి ఉందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అరెస్ట్ చేసిన నిందితుల నుంచి పోలీసులు భారీగా నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 63.19 లక్షల రూపాయల నగదుతో పాటు కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో తొమ్మిది మంది నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. త్వరలోనే వారందరినీ పట్టుకుని చట్టం ముందు నిలబెడతామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవస్థీకృత నేరాన్ని ఛేదించడంలో జనగామ డీసీపీ, ఏఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది చూపిన చొరవను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక ఆధారాలను సేకరించడం, నిందితుల కదలికలను కనిపెట్టడం ద్వారా ఈ ముఠా గుట్టును రట్టు చేయగలిగారు. ప్రభుత్వ వ్యవస్థలను మోసం చేస్తూ ఆదాయానికి గండి కొట్టే ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

ఈ ఉదంతం నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ వంటి కీలకమైన పనుల విషయంలో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆన్‌లైన్‌లో చలాన్లు కట్టేటప్పుడు లేదా రసీదులు తీసుకునేటప్పుడు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా వాటి ప్రామాణికతను స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు.

చివరగా, ప్రభుత్వ వ్యవస్థల్లో ఉన్న ఇటువంటి సాంకేతిక లొసుగులను సరిదిద్దడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా చూడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందుతుందో, నేరగాళ్లు కూడా దానికి తగ్గట్టుగా రూపాంతరం చెందుతున్నారని ఈ ఘటన రుజువు చేస్తోంది. సామాన్యుల కష్టార్జితం, ప్రభుత్వ ఖజానా దుర్వినియోగం కాకుండా ఉండాలంటే కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అవసరమని ఈ కుంభకోణం స్పష్టం చేస్తోంది.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్

**విశాలభారతి, భూపాలపల్లి :**


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన "Arrive Alive" కార్యక్రమంలో భాగంగా, జయశంకర్, భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనేనని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు మరియు ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఇవి చిన్న నియమాలుగా కనిపించినప్పటికీ, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే అత్యంత కీలక భద్రతా చర్యలని వివరించారు.అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ వాహనం నడపడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని కోరారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సంకేతాలను తప్పనిసరిగా పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. Arrive Alive" కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమేనని పేర్కొంటూ, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని అడిషనల్ ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం, రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలపైఈ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పోలీస్ ఉద్యోగులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.



# మేడారంకు పోటెత్తిన భక్తులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ఈ ఏడాది అద్భుతమైన రీతిలో ప్రారంభమైంది. ములుగు జిల్లాలోని దట్టమైన అడవుల మధ్య కొలువుదీరిన వన దేవతలను దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తున్నారు. అధికారికంగా జాతర తేదీలు సమీపిస్తున్న కొద్దీ జనసందోహం ఊహించని రీతిలో పెరుగుతోంది. ఈ క్రమంలో భక్తులు తమ మొక్కులను ముందుగానే చెల్లించుకోవాలనే ఉద్దేశంతో భారీగా తరలిరావడంతో మేడారం పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారిపోయాయి. ఎటు చూసినా భక్తుల కోలాహలం, డప్పు చప్పుళ్లతో ఈ అడవి ప్రాంతం కొత్త కళను సంతరించుకుంది. అయితే ఊహించని విధంగా పెరిగిన రద్దీ కారణంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా ములుగు గట్టమ్మ తల్లి ఆలయం దగ్గర వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. జకారం నుంచి మేడారం వరకు ఉన్న ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్ జామ్‌తో కిక్కిరిసిపోయాయి. చింతల్ క్రాస్ రోడ్డు వద్ద సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వెంగళపూర్ నుంచి నార్లాపూర్ మధ్య కూడా ట్రాఫిక్ స్తంభించిపోవడంతో భక్తులు గంటల తరబడి వాహనాల్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న అధికారుల అంచనా ప్రకారం ఇప్పటికే నాలుగు లక్షల మందికి పైగా భక్తులు మేడారానికి చేరుకున్నారు.



ఈ మహా జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భారీ ఏర్పాట్లు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది మంది భక్తులు వస్తారనే అంచనాతో అన్ని శాఖలను సమన్వయం చేస్తూ పక్కా ప్రణాళికను రూపొందించింది. భక్తులకు తల్లుల దర్శనం ప్రశాంతంగా, సులభంగా జరిగేలా చూడటమే తమ ప్రథమ ప్రాధాన్యతని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. భక్తుల రక్షణ కోసం, సౌకర్యాల కోసం క్షేత్రస్థాయిలో యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండి పనిచేస్తోంది. జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం సుమారు 21 ప్రభుత్వ శాఖలకు చెందిన 42,027 మంది అధికారులను మరియు సిబ్బందిని విధుల్లో నియమించింది. వీరితో పాటు స్థానిక ఆదివాసీ యువత 2,000 మంది వాలంటీర్లుగా మారి భక్తులకు సేవలు అందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడానికి, భక్తుల భద్రతను పర్యవేక్షించడానికి భారీ పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. మేడారం అటవీ ప్రాంతం అయినప్పటికీ, కమ్యూనికేషన్ వ్యవస్థలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా శాశ్వత, తాత్కాలిక మొబైల్ టవర్లను ఏర్పాటు చేయడం గమనార్హం. దీనివల్ల అత్యవసర సమయాల్లో సమాచార మార్పిడి వేగంగా జరుగుతుంది.

పరిపాలనా సౌలభ్యం కోసం మేడారం ప్రాంతాన్ని మొత్తం ఎనిమిది జోన్లుగా, 42 సెక్టార్లుగా విభజించారు. ప్రతి జోన్‌కు ఒక జిల్లా స్థాయి అధికారిని ఇన్చార్జిగా నియమించడం వల్ల సమస్యలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుంది. అలాగే మండల స్థాయి అధికారులు సెక్టార్ల బాధ్యతలను చూసుకుంటున్నారు. ఇలాంటి వికేంద్రీకృత వ్యవస్థ వల్ల రద్దీని నియంత్రించడం సులభం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. భక్తుల రద్దీని బట్టి దర్శన క్యూలైన్లను క్రమబద్ధీకరించడం ఈ అధికారుల ప్రధాన బాధ్యతగా ఉంది. జాతరలో తప్పిపోయిన వారిని చేరవేయడానికి, అత్యవసర వైద్య సేవలు అందించడానికి గద్దెలు, జంపన్న వాగు, ఆర్టీసీ బస్టాండ్ వంటి కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల భద్రత కోసం గజ ఈతగాళ్లను కూడా సిద్ధంగా ఉంచారు. మైకుల ద్వారా నిరంతరం భక్తులకు సూచనలు అందజేస్తున్నారు. అలాగే భక్తులకు కనీస అవసరాలైన మంచినీరు, పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన క్యూలైన్ల వ్యవస్థను ప్రభుత్వం రూపొందించింది.

రవాణా పరంగా తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం 525 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు చేపట్టింది. కొత్తగా నిర్మించిన రోడ్లు, కల్వర్టులు భక్తుల రాకపోకలను సులభతరం చేస్తున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం దాదాపు 1,418 ఎకరాల అటవీ భూమిని సిద్ధం చేయడం విశేషం. సుమారు 42 పార్కింగ్ స్థలాల్లో లక్షలాది వాహనాలను నిలిపేలా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతరం నీటి సరఫరా జరుగుతోంది.

# 'మేం పాలకులం కాదు సేవకులం'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా అభివృద్ధి పథంలో సాగేది కానీ కారణాలు ఏవైనా ప్రాజెక్టులు పూర్తి కాలేదు. అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేస్తున్నాం.'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు అయినా ఎవరికి వారు తమ ప్రాంతానికే రావాలనుకోవడంతో యూనివర్సిటీ ఏర్పాటు జాప్యమైంది. బాసర ఐఐటీలో యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుందాం. ఇందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకి సూచన చేస్తున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.'ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి సీఎం సూచించారు.'మీరు ఒక నివేదిక తయారు చేసి ఇవ్వండి. ఆదిలాబాద్‌కు కావాల్సిన అభివృద్ధి, రావాల్సిన నిధులను మంజూరు చేసుకుందాం. ఆదిలాబాద్ రైతాంగానికి నీళ్లు ఇవ్వాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాల్సిందే.బడ్జెట్ సమావేశాల లోపు తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆదేశించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించుకుందాం.. ప్రతీ చుక్కను ఒడిసిపట్టుకుని ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసుకుందాం'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తాం**

తెలంగాణలో అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర ప్రణాళికను ప్రకటించారు. బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం, నిర్మల్‌లో ఏటీసీ ఏర్పాటు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తాగు, సాగునీటి కోసం తుమ్మిడిహెట్టి వద్ద చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం, జిల్లాలో కొత్తగా అతిపెద్ద పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి ప్రణాళికలను వెల్లడించారు. 'తెలంగాణ ప్రాంతంలో అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్‌లో జరగాల్సినంత అభివృద్ధి, జిల్లాకు రావలసిన నీరు రాలేదు. పాలమూరు జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేసుకుంటున్నామో అదే తరహాలో ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తాం. చనాక - కొరాట బ్యారేజీకి మాజీ మంత్రి చిలుకూరి



రామచంద్రారెడ్డి పేరును, సదర్మట్ బ్యారేజీకి స్వతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి పేరును పెడుతున్నాం. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలి.'అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పదేళ్ల పాటు చనాకా - కొరాట పూర్తి చేయలేదు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును పూర్తి చేసుకున్నాం. నిర్మల్ లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం. సరస్వతీ ఆలయమున్న బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తాం. యూనివర్సిటీని ఎక్కడ ఏర్పాటు చేయాలని చర్చించుకుంటూ పోతే ప్రారంభం కాదు. అందుకే బాసరలో వర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ప్రజాప్రతినిధులు అందుకు సహకరించాలి.'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ఆదిలాబాద్‌లో అతిపెద్ద పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసి దేశంలోని ప్రతి పరిశ్రమను ఇక్కడ స్థాపించేలా చర్యలు తీసుకుంటాం. పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం 10 వేల ఎకరాల భూమి సేకరించాలి. ఎన్నికల సమయంలో రాజకీయాలు. ఇప్పుడు ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం కలిసిమెలిసి పనిచేద్దాం. ఎర్రబస్సు కూడా రావడం లేదని చెబుతున్న పరిస్థితి నుంచి ఎయిర్ బస్సు వచ్చేలా ప్రధానమంత్రి మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకుందాం.'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'రాష్ట్రానికి సంబంధించి అనుమతులు, నిధుల కోసం ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోడీని కేంద్ర మంత్రులను ఎలాగైతే కలుస్తున్నామో...అదే తరహాలో పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి పనుల కోసం ప్రజాప్రతినిధులు రావాలి.'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో...ఆ మరుసటి రోజు అధికార యంత్రాంగంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలి. ఆ నివేదికపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి బడ్జెట్ సమావేశాల్లో అనుమతులు మంజూరు చేస్తాం. తుమ్మిడిహెట్టి వద్ద గతంలో ప్రతిపాదిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి తీరుతాం. అందుకు డీపీఆర్ సిద్ధమవుతోంది. తుమ్మిడిహెట్టి కట్టాలంటే మహారాష్ట్ర నుంచి కొన్ని అనుమతులు తీసుకోవాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక మాట చెబితే మన ప్రాంతానికి మేలు జరుగుతుంది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తాం.'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'నాగోబా జాతర కోసం రూ.22 కోట్లు కావాలని అడిగారు. తప్పనిసరిగా మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. దాదాపు 300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మేడారం సమ్మక్క సారలమ్మ మందిరాన్ని కుంభమేళా స్థాయిలో గొప్పగా పనులు చేస్తున్నాం.'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.'మన భవిష్యత్ తరాల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మేం పాలకులం కాదు. సేవకులం.'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ నగేశ్‌తోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

**విశాలభారతి,పరకాల :**

మహారాష్ట్ర మున్సిపాలిటీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో పరకాల పట్టణంలో శుక్రవారం అంగరంగ వైభవంగా సంబరాలు నిర్వహించారు. పరకాల పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ పి జయంత్ లాల్ మాట్లాడుతూ మహారాష్ట్రలో అత్యధిక మున్సిపాలిటీలను బీజేపీ కైవసం చేసుకోవడం ఎంతో ఆనందకరమని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేసిన సంక్షేమ పథకాలే బీజేపీ విజయాలకు పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం పాలకుర్తి తిరుపతి బాసాని సోమరాజు, మారేడు గొండ భాస్కరాచారి, ధర్నా నారాయణదాసు, పావుశెట్టి శ్రీనివాస్, మార్త రాజభద్రయ్య, దంచనాల సత్యనారాయణ, ఆకుల రాంబాబు, మిడిదొడ్డి నరేష్, దంచనాల కిరణ్, కుంట మల్ల గణేష్, కానుగుల గోపీనాథ్, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు



# బీజేపీ విజయదుందుభి

**విశాలభారతి, నేషనల్:**

మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు ఆ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తూ, భారతీయ జనతా పార్టీకి వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చాయి. ముంబై లాంటి మెట్రో నగరాన్ని పక్కన పెడితే, మిగిలిన 28 కార్పొరేషన్లలో కమలం పార్టీ సృష్టించిన ప్రభంజనం ప్రత్యర్థి పార్టీలకు గట్టి షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పట్టణ ప్రాంత ఓటర్లు బీజేపీ అభివృద్ధి మంత్రానికే జై కొట్టారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార పీఠంపై ఉన్న మహాయుతి కూటమిలో బీజేపీ పెద్దన్న పాత్ర పోషిస్తూనే, తన బలాన్ని పదింతలు పెంచుకోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రంలోని విద్యా, ఐటీ హబ్‌గా పేరున్న పుణె నగరంలో బీజేపీ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగింది. అక్కడ ఉన్న మొత్తం 165 స్థానాల్లో ఏకంగా 123 సీట్లను గెలుచుకోవడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. పుణె ఓటర్లు కమలం వైపు ఏకపక్షంగా మొగ్గు చూపడం చూస్తుంటే, అక్కడ ప్రతిపక్షాల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందనిపిస్తోంది. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే ఈ భారీ విజయానికి బాటలు వేశాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సొంత గడ్డ అయిన నాగ్‌పూర్‌లో కూడా బీజేపీ జెండా రెపరెపలాడింది. 151 సీట్లున్న ఈ కార్పొరేషన్‌లో 102 స్థానాలను కైవసం చేసుకో



వడం ద్వారా తన పట్టు ఏమాత్రం తగ్గలేదని బీజేపీ నిరూపించుకుంది. నాగ్‌పూర్ నగరం ఎప్పుడూ బీజేపీకి కంచుకోటగానే ఉన్నప్పటికీ, ఈసారి వచ్చిన మెజారిటీ మరింత ఉత్సాహాన్ని నింపింది. స్థానిక నాయకత్వం, క్షేత్రస్థాయి కార్యకర్తల సమన్వయం వల్లే ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. పారిశ్రామిక నగరాలైన సోలాపూర్, నాసిక్ వంటి చోట్ల కూడా బీజేపీ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సోలాపూర్‌లో 102 సీట్లకు గానూ 87 చోట్ల విజయం సాధించడం ఒక రికార్డు అని చెప్పవచ్చు. నాసిక్‌లో కూడా 122 స్థానాల్లో 72 సీట్లను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. ఈ ప్రాంతాల్లో గతంలో ఇతర పార్టీలకు ఉన్న పట్టును బీజేపీ పూర్తిగా తుడిచిపెట్టేసింది. పింప్రిచించ్‌వాడ్, పన్వేల్, జల్గావ్ వంటి నగరాల్లో కూడా ఇదే ట్రెండ్ కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ హవా స్పష్టంగా కనిపించింది.

ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూడా తన సత్తా చాటుకుంది. తన సొంత ఇలాకా అయిన థానేలో షిండే తన పట్టును నిరూపించుకున్నారు. అక్కడ 131 స్థానాలకు గానూ 50 సీట్లు సాధించి అతిపెద్ద పార్టీగా నిలవడం ద్వారా, అసలైన శివసేన తనదేనని ఆయన చెప్పకనే చెప్పారు. కళ్యాణ్‌డోంబివిలిలో కూడా 122 స్థానాల్లో 55 సీట్లను గెలుచుకుని షిండే సేన ముందంజలో నిలిచింది. బీజేపీతో పొత్తులో ఉంటూనే తన ఉనికిని కాపాడుకోవడంలో షిండే సఫలమయ్యారని ఈ ఫలితాలు చెబుతున్నాయి. చారిత్రాత్మక నగరమైన ఛత్రపతి శంభాజీనగర్‌లో కూడా బీజేపీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. అక్కడ 58 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే ఇక్కడ ఏఐఎంఐఎం పార్టీ 33 స్థానాల్లో గెలిచి రెండో స్థానంలో నిలవడం గమనార్హం. ఇది ఆ నగరంలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతోంది. పాత శివసేన ఓటు బ్యాంకు ఇప్పుడు బీజేపీ, షిండే సేన మధ్య చీలిపోవడం, ఎంఐఎం తన బలాన్ని పెంచుకోవడం అక్కడ త్రిముఖ పోటీకి దారితీసింది. విపక్షాల పరిస్థితి ఈ ఎన్నికల్లో అంత ఆశాజనకంగా లేదు. కాంగ్రెస్ పార్టీ కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. కొల్హాపూర్‌లో కాంగ్రెస్ 35 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ, అక్కడ కూడా మహాయుతి కూటమి గట్టి పోటీ ఇచ్చింది. అయితే లాతూర్‌లో మాత్రం కాంగ్రెస్ తన పట్టును నిలుపుకుంది. 70 సీట్లలో 43 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించడం ఆ పార్టీకి కొంత ఊరటనిచ్చే విషయం. చంద్రపూర్‌లో కూడా కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది కానీ, రాష్ట్రవ్యాప్తంగా చూస్తే అది నామమాత్రంగానే మిగిలిపోయింది. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తింది. పర్భణీలో 25 సీట్లతో ముందంజలో ఉన్నప్పటికీ, మిగిలిన ప్రధాన నగరాల్లో ఆ పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గింది. పార్టీ చీలిక తర్వాత కార్యకర్తల్లో ఏర్పడిన గందరగోళం, సరైన నాయకత్వం లేకపోవడం ఆ పార్టీ కొంప ముంచాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ముంబై వెలుపల ఉద్ధవ్ సేన తన పూర్వ వైభవాన్ని కోల్పోతున్నట్లు ఈ ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలుగా చీలిన ఎన్సీపీ కూడా కొన్ని పాకెట్లకే పరిమితమైపోయింది. స్థానిక పార్టీల విషయానికి వస్తే, వసయ్‌విరార్ ప్రాంతంలో బహుజన్ వికాస్ అఘాడీ తన పట్టును నిలుపుకోగా, మాలేగావ్‌లో స్థానిక ఇస్లామ్ పార్టీ మెజారిటీ సాధించింది. ఇలా కొన్ని ప్రాంతాల్లో స్థానిక సెంటిమెంట్లు పని చేసినప్పటికీ, ఓవరాల్‌గా మహారాష్ట్ర పట్టణ ఓటరు మాత్రం జాతీయ పార్టీ అయిన బీజేపీ వైపు నిలబడటమే విశేషం. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఒకే పార్టీ పాలన ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఓటర్లు భావించినట్లు ఈ తీర్పు ద్వారా అర్థమవుతోంది. మొత్తం మీద ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మహారాష్ట్రలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఒక దిక్సూచిలా మారాయి.

# ఎంతకాలం విచారించాలి



**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తిని మళ్లీ మళ్లీ అదే కారణంతో ఇబ్బంది పెట్టడం సరికాదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఒకవేళ విచారణలో భాగంగా మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉంటే లేదా విచారణ ఇంకా అవసరమని భావిస్తే, నిందితుడిని పిలిచి మళ్లీ ప్రశ్నించవచ్చు కదా అని ధర్మాసనం సూచించింది. ఒక వ్యక్తిని విచారించే అధికారం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం శిక్షాత్మక చర్యల కోసం ప్రయత్నిస్తోందని అనిపిస్తే తాము అలాంటి ధోరణిని ప్రోత్సహించలేమని న్యాయస్థానం స్పష్టం చేయడం విశేషం. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా మరియు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు గతంలో కోర్టు ఆదేశాల ప్రకారం విచారణకు హాజరైనప్పటికీ, ప్రస్తుత దర్యాప్తుకు ఏమాత్రం సహకరించడం లేదని వారు ధర్మాసనానికి వివరించారు. దర్యాప్తు సంస్థ అడిగే కీలక ప్రశ్నలకు ఆయన నుంచి సరైన సమాధానాలు రావడం లేదని, దర్యాప్తు ప్రక్రియ మందగించేలా ఆయన ప్రవర్తన ఉందని వారు వాదించారు. గతంలో పరారీలో ఉన్న వ్యక్తిగా ప్రకటించబడిన వ్యక్తికి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొనసాగించే హక్కు ఉండదని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ముఖ్యంగా జాతీయ భద్రత మరియు వ్యక్తుల గోప్యత అంశాలను తుషార్ మెహతా తన వాదనలో ప్రముఖంగా ప్రస్తావించారు. మావోయిస్టుల కదలికలను కనిపెట్టాలనే ముసుగులో ప్రభాకర్ రావు కీలకమైన వ్యక్తులపై అక్రమంగా నిఘా పెట్టారని ఆయన ఆరోపించారు. దీనివల్ల వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగడమే కాకుండా, ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని పేర్కొన్నారు. నిందితుడు కొన్ని కీలకమైన డిజిటల్ ఖాతాలకు సంబంధించిన యాక్సెస్ కూడా దర్యాప్తు అధికారులకు ఇవ్వలేదని, తద్వారా సాక్ష్యాలను మరుగున పరిచే ప్రయత్నం జరుగుతోందని ప్రభుత్వం తన ఆందోళనను వ్యక్తపరిచింది.

ప్రభుత్వ వాదనలను విన్నప్పటికీ, ధర్మాసనం మాత్రం ప్రభాకర్ రావుకు ఊరటనిచ్చే నిర్ణయాన్నే తీసుకుంది. ఆయనకు గతంలో మంజూరు చేసిన మధ్యంతర రక్షణ బెయిల్‌ను మార్చి 10వ తేదీ వరకు పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుడు విచారణకు రానని ఎప్పుడూ చెప్పలేదని, ఒకవేళ భవిష్యత్తులో కూడా మీరు విచారణకు పిలిస్తే ఆయన తప్పకుండా హాజరవుతారని తాము ఆదేశిస్తామని ధర్మాసనం భరోసా ఇచ్చింది. దీనివల్ల అరెస్టు నుంచి ప్రభాకర్ రావుకు తాత్కాలికంగా గండం తప్పినట్లయింది. అయితే ఈలోగా ప్రభుత్వం తన దగ్గర ఉన్న ఆధారాలను మరింత పకడ్బందీగా సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

అదే సమయంలో ఫోన్ టాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి టి.హరీష్ రావు మరియు మాజీ డీసీపీ రాధాకిషన్ రావులపై దాఖలైన కేసులకు సంబంధించి ప్రభుత్వం వేసిన రెండు పిటిషన్లను జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం కొట్టివేసింది. గతంలో వీరిద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను హైకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఇచ్చిన ఆ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే హైకోర్టు తన పరిధిలో లోతుగా విశ్లేషించి ఇచ్చిన ఆ ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టంగా తేల్చి చెప్పింది.

రీష్ రావు వంటి కీలక రాజకీయ నేతల పేర్లు ఈ కేసులో వినపడటం వల్ల రాజకీయంగా కూడా ఈ పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడంతో వారికి ఈ కేసు నుంచి పెద్ద ఊరట లభించినట్లయింది. ప్రభుత్వానికి మాత్రం తమ ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ప్రాథమిక ఆధారాలను కోర్టు ముందు ఉంచడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఈ తీర్పుల ద్వారా అర్థమవుతోంది. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా కోర్టులు భావిస్తే అది ప్రభుత్వానికి ప్రతికూల ఫలితాలను ఇస్తుందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో గత ప్రభుత్వం ఉన్న సమయంలో జరిగిన ఈ ఫోన్ టాపింగ్ వ్యవహారం సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరినీ ఆందోళనకు గురిచేసింది. నిఘా వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష నేతల, వ్యాపారవేత్తల వ్యక్తిగత సంభాషణలను విన్నారనేది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులు అరెస్టై జైల్లో ఉండగా, కీలక సూత్రధారిగా భావిస్తున్న ప్రభాకర్ రావు విదేశాల నుంచి వచ్చి విచారణలో పాల్గొంటున్నారు. ఈ కేసు మూలాలు ఎక్కడి వరకు వెళ్తాయో అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల పనితీరుపై చర్చకు దారితీశాయి. మొత్తానికి సుప్రీంకోర్టు ఈ కేసును కేవలం ఒక క్రిమినల్ కేసుగా మాత్రమే కాకుండా, వ్యక్తిగత స్వేచ్ఛ మరియు ప్రభుత్వ అధికారాల మధ్య సమతుల్యతను కాపాడే కోణంలో చూస్తోంది. నిందితుడికి విచారణకు సహకరించే అవకాశం ఇస్తూనే, ప్రభుత్వం దర్యాప్తును వేగవంతం చేయాలని కోరుతోంది. అనవసరంగా పిటిషన్లను పొడిగించడం వల్ల న్యాయ ప్రక్రియ కాలయాపన అవుతుందని, అందుకే మార్చి 10వ తేదీ తర్వాత ఈ కేసు ఏ దిశగా వెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ న్యాయవాదులు తమ వాదనలను మరింత బలంగా వినిపించాలంటే కచ్చితమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది.

రాబోయే రోజుల్లో ఫోన్ టాపింగ్ కేసు విచారణ మరింత వేడెక్కే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు అటు అధికారుల్లోనూ, ఇటు రాజకీయ నాయకుల్లోనూ కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు హరీష్ రావు, రాధాకిషన్ రావుల విషయంలో తదుపరి చర్యలు ఏ విధంగా తీసుకుంటుందనేది చూడాలి. ఫోన్ టాపింగ్ వంటి సున్నితమైన అంశాలలో రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తే న్యాయస్థానాలు ఎంత కఠినంగా ఉంటాయో ఈ విచారణ ద్వారా స్పష్టమవుతోంది. మార్చి 10న జరిగే తదుపరి విచారణలో ప్రభాకర్ రావు భవిష్యత్తు మరియు ఈ కేసు తుది గమ్యం తేలే అవకాశం ఉంది.

# సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగర రవాణా ముఖచిత్రాన్ని మార్చే కీలకమైన మెట్రో రెండో దశ పనుల విషయంలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి, రాజకీయ మలుపులు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను పక్కనపెట్టి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయడంతో పనులు కొంత ఆలస్యమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. నగరంలో నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే మెట్రో రెండో దశను వెంటనే పట్టాలెక్కించాల్సిన అవసరం ఉందని ఈ లేఖలో ఆయన గట్టిగా నొక్కి చెప్పారు. మెట్రో రెండో దశ పురోగతిపై కేంద్రం వైఖరిని స్పష్టం చేస్తూనే, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన బాధ్యతాయుతమైన చర్యలను కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ఆయన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో తాను జరిపిన చర్చల సారాంశాన్ని రేవంత్ రెడ్డికి వివరించారు. మొదటి దశ మెట్రో నిర్వహణ ప్రస్తుతం ఎల్ అండ్ టీ సంస్థ చేతిలో ఉందని, దానిని రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటానని ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. మెట్రో రెండో దశపై కేంద్రం ముందడుగు వేయాలంటే, ముందుగా మొదటి దశకు సంబంధించిన బదలాయింపు ప్రక్రియ, ఆర్థిక లావాదేవీలు ఒక కొలిక్కి రావాలని కేంద్రం భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఈ ప్రాజెక్టు పట్ల సానుకూలంగా ఉన్నారని, అయితే కొన్ని సాంకేతిక, పాలనాపరమైన ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసే విషయంలో ఒప్పందాలు, నిర్ణయాలు త్వరితగతిన పూర్తి చేస్తేనే రెండో దశపై స్పష్టత వస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తదుపరి సహకారం కోసం ఎదురుచూస్తున్నామని కేంద్ర మంత్రి పేర్కొన్నట్లు ఈ లేఖ ద్వారా వెల్లడించారు.

రెండో దశ సన్నాహక పనుల కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించుకున్నాయని కిషన్



రెడ్డి గుర్తుచేశారు. ఈ కమిటీలో కేంద్రం తరపున ఇద్దరు, రాష్ట్రం తరపున ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా ఉండాలని కేంద్ర మంత్రి ఖట్టర్ సూచించారని వివరించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే మెట్రో విస్తరణకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు, నిధుల సమీకరణ, ఇతర ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కీలకమైన ప్రాజెక్టు విషయంలో రెండు ప్రభుత్వాల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఇక్కడే అసలైన పీచుముడి పడింది. సంయుక్త కమిటీ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉన్నప్పటికీ, రాష్ట్ర స్థాయి నుంచి కావాల్సిన కసరత్తు జరగకపోవడం వల్ల ప్రాజెక్టు కుంటుపడుతోందని ఆయన విమర్శించారు. వెంటనే ఇద్దరు ఐఏఎస్ అధికారుల పేర్లను కేంద్రానికి పంపి సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డిని కోరారు. ఇలాంటి జాప్యం వల్ల ప్రాజెక్టు వ్యయం పెరగడమే కాకుండా, ప్రజలపై ట్రాఫిక్ భారం కూడా పెరుగుతూనే ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రస్తుతం నగరంలోని ప్రధాన ప్రాంతాలను కలుపుతూ విజయవంతంగా నడుస్తోంది. దీనిని మరింత విస్తరిస్తేనే నగర శివారు ప్రాంతాలకు కూడా రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. ముఖ్యంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కిషన్ రెడ్డి కోరారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే రెండో దశ నిర్మాణానికి అవసరమైన పూర్తిస్థాయి ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించాలని సూచించారు. దీనివల్ల నిధుల మంజూరులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ఆయన ముఖ్యమంత్రికి భరోసా ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన రూట్లలో పాతబస్తీ మెట్రో, శంషాబాద్ విమానాశ్రయం కనెక్టివిటీ వంటివి కీలకమైనవి. పాత రూట్లను మార్చడం వల్ల కొంత సమయం వృథా అయిందని ప్రజలు భావిస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి లేఖ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి నగరాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్రం వైపు నుంచి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, బంతి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కోర్టులోనే ఉందని ఆయన పరోక్షంగా సందేశం ఇచ్చారు.

మరోవైపు, మెట్రో పనులపై నెలకొన్న ఈ రాజకీయ వాగ్వాదం సాధారణ ప్రయాణికులను కలవరపెడుతోంది. మెట్రో విస్తరణ జరిగితే ఐటీ కారిడార్, ఇతర రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ తగ్గుతుందని వారు ఆశపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత పేరుతో చేస్తున్న కొత్త ప్రణాళికలు త్వరగా కార్యరూపం దాల్చాలని జనం కోరుకుంటున్నారు. కిషన్ రెడ్డి లేఖపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అధికారుల పేర్లను పంపడంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుందో చూడాలి. ఈ లేఖ ద్వారా కిషన్ రెడ్డి కేవలం విమర్శలు చేయడమే కాకుండా, పరిష్కార మార్గాలను కూడా సూచించడం గమనార్హం. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హామీని కూడా ఇందులో ఉటంకించడం వల్ల నిధుల విషయంలో ఇబ్బంది ఉండదని అర్థమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చేయాల్సిన పనులను వేగవంతం చేస్తే, కేంద్రం నుంచి రావాల్సిన క్లియరెన్స్‌లు త్వరగా వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్ లాంటి గ్లోబల్ సిటీకి మెట్రో రెండో దశ ప్రాణం వంటిదని, దీనిని నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆయన తన లేఖలో అంతరార్థాన్ని వివరించారు. మొత్తానికి హైదరాబాద్ మెట్రో రెండో దశపై నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడానికి కేంద్ర మంత్రి రాసిన లేఖ ఒక కీలక మలుపుగా భావించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంయుక్త కమిటీకి అధికారులను కేటాయిస్తేనే ఈ ప్రాజెక్టులో పురోగతి కనిపిస్తుంది. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం మేల్కోవాలని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి నగరవాసులకు మెరుగైన రవాణా వ్యవస్థను అందించాలని అందరూ కోరుకుంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఎప్పుడు వెల్లడిస్తుందో వేచి చూడాలి.

# దానంపై వేటు..?

**మొదటిపేజీ తరువాయి**

పెను సంచలనం సృష్టిస్తోంది. న్యాయస్థానం విధించిన రెండు వారాల గడువు ఇప్పుడు ఫిరాయింపు ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఈ పరిణామాలు కేవలం ముగ్గురు ఎమ్మెల్యేల భవితవ్యాన్ని మాత్రమే కాకుండా, రాష్ట్ర అధికార పక్ష వ్యూహాలను కూడా ప్రభావితం చేసేలా కనిపిస్తున్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యాన్ని అత్యున్నత న్యాయస్థానం ఏమాత్రం సహించడం లేదు. జస్టిస్ సంజయ్ కరోల్ మరియు జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌తో కూడిన ధర్మాసనం స్పీకర్ కార్యాలయానికి ముక్కుతాడు వేసేలా వ్యాఖ్యలు చేసింది. నిర్ణయం మీరు తీసుకుంటారా లేక మమ్మల్నే తీసుకోమంటారా అని కోర్టు అడిగిన ప్రశ్న నేరుగా రాజ్యాంగబద్ధమైన అధికారాల పరిధిని గుర్తు చేసింది. ఇది స్పీకర్ వ్యవస్థకు ఒక రకమైన హెచ్చరికగానే రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కోర్టులో స్పీకర్ తరఫు న్యాయవాదులు మరికొంత సమయం కోరడంపై ధర్మాసనం మండిపడటం గమనార్హం. ఇప్పటికే తగినంత సమయం వృథా అయిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి జాప్యాలు ఫిరాయింపులను ప్రోత్సహించినట్లు అవుతుందని కోర్టు అభిప్రాయపడింది. అందుకే నాలుగు వారాల సమయం అడిగితే కేవలం రెండు వారాలే ఇస్తూ డెడ్ లైన్ విధించింది. ఇదే చివరి అవకాశం అని తేల్చి చెప్పడం ద్వారా న్యాయస్థానం తన కఠిన వైఖరిని స్పష్టం చేసింది. దీనివల్ల ఇకపై సాకులు చెప్పే అవకాశం స్పీకర్ కార్యాలయానికి లేకుండా పోయింది.

ముఖ్యంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి, మరియు టెల్లం వెంకట్రావు వంటి కీలక నేతల భవితవ్యం ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో పడింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు రాగా, ఏడుగురి విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై కోర్టు ప్రస్తుతానికి జోక్యం చేసుకోకపోయినా, ఈ ముగ్గురి విషయంలో మాత్రం స్పష్టత కోరుతోంది. వీరు ముగ్గురూ బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వారు



కావడంతో, వీరిపై అనర్హత వేటు పడుతుందా లేదా అన్నది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

ఈ ముగ్గురు ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రికార్డులు ఉండటంతో ఆయన ఫిరాయింపును నిరూపించడం సులభమని న్యాయ నిపుణులు అంటున్నారు. మరోవైపు కడియం శ్రీహరి మరియు సంజయ్ తాము ఇంకా అధికారికంగా కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం అభివృద్ధి పనుల కోసమే కలిశామని బుకాయిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సాంకేతిక ఆధారాలను స్పీకర్ ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. గతంలో స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేల విషయంలో ఇచ్చిన క్లీన్ చిట్ పై కూడా రాజకీయంగా విమర్శలు వస్తున్నాయి. కేవలం ఆధారాలు లేవనే నెపంతో వారి పిటిషన్లను కొట్టివేయడంపై ప్రతిపక్షాలు ఆగ్రహంగా ఉన్నాయి. అయితే సుప్రీంకోర్టు ఆ పాత నిర్ణయాలను ఇప్పుడు సమీక్షించలేమని, కావాలంటే వాటిపై విడిగా పిటిషన్లు వేసుకోవాలని సూచించింది. అంటే ప్రస్తుతానికి కోర్టు దృష్టి అంతా పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలపైనే కేంద్రీకృతమై ఉంది. రెండు వారాల్లో స్పీకర్ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో స్పీకర్ వ్యవస్థ విఫలమవుతోందని కోర్టు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. సాధారణంగా స్పీకర్ నిర్ణయాల్లో కోర్టులు త్వరగా జోక్యం చేసుకోవు, కానీ రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఇది భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే పార్టీ ఫిరాయింపుల కేసులకు ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది. తెలంగాణ స్పీకర్ ఇప్పుడు ఎటు తేల్చలేని ధర్మసంకటంలో పడ్డారని చెప్పవచ్చు. అసెంబ్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, స్పీకర్ కార్యాలయం ఇప్పుడు సుప్రీం ఆదేశాల మేరకు అఫిడవిట్ సిద్ధం చేసే పనిలో పడింది. రెండు వారాల్లోగా ఏం చర్యలు తీసుకున్నారో వివరించాల్సి ఉండటంతో, సాధ్యమైనంత త్వరగా విచారణ ప్రక్రియను ముగించేలా కనిపిస్తున్నారు. ఒకవేళ స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే, సుప్రీంకోర్టే నేరుగా అనర్హత వేటు వేసే అసాధారణ నిర్ణయం తీసుకుంటుందా అనే భయం అధికార పక్షంలో మొదలైంది. ఇది ప్రభుత్వ స్థిరత్వంపై పెద్దగా ప్రభావం చూపకపోయినా నైతికంగా దెబ్బతీసే అంశమే. రాజకీయ వర్గాల్లో ఇప్పుడు అంతా దానం నాగేందర్ చుట్టూనే చర్చ జరుగుతోంది. ఒకవేళ ఆయనపై అనర్హత వేటు పడితే అది రాష్ట్రంలో ఉప ఎన్నికలకు దారితీస్తుంది. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు తృటిలో తప్పించుకున్నా, దానం విషయంలో మాత్రం స్పీకర్ కఠినంగా ఉండక తప్పదని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏది ఏమైనా రెండు వారాల తర్వాత జరగబోయే విచారణ తెలంగాణ రాజకీయ యవనికపై ఒక కీలక మలుపు కానుంది. స్పీకర్ తీసుకోబోయే నిర్ణయం రాజ్యాంగబద్ధంగా ఉంటుందా లేక రాజకీయ వ్యూహాలకు అనుగుణంగా ఉంటుందా అన్నది చూడాలి. చివరగా, సుప్రీంకోర్టు చురకలు అటు ప్రభుత్వాన్ని, ఇటు స్పీకర్‌ను ఆత్మరక్షణలో పడేశాయి. రెండు వారాల గడువు అనేది చాలా తక్కువ సమయం కాబట్టి, ప్రతి రోజూ ఎంతో కీలకంగా మారింది. ప్రజా తీర్పును గౌరవించకుండా పార్టీలు మారే సంస్కృతికి చెక్ పెట్టాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారు. న్యాయస్థానం ఈ విషయంలో ఎంత గట్టిగా ఉంటే భవిష్యత్తులో ఫిరాయింపులు అంతగా తగ్గుతాయని మేధావుల అభిప్రాయం. ఈ ఉత్కంఠభరిత రాజకీయం మరి కొద్ది రోజుల్లో ఒక కొలిక్కి రానుంది.

# ఆకాశంలో రంగుల జాతర

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ పర్యాటక శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్' నగరంలో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. సాహస ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ వేడుకను, గోల్కొండ గోల్ఫ్ కోర్సు వద్ద పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా బెలూన్‌లో విహరించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఉత్సవం హైదరాబాద్ నగరానికి ఒక కొత్త శోభను తీసుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల పాటు నిర్వహిస్తున్న 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్', 'డ్రోన్ ఫెస్టివల్'తో పాటు, ఈ 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్'ను కూడా ఒక ప్రధాన ఆకర్షణగా చేర్చింది. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే పండుగలతో పాటు, ఇలాంటి ఆధునిక సాహస క్రీడలను జోడించడం ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గోల్కొండ గోల్ఫ్ కోర్సు ఈ అద్భుత ఘట్టానికి వేదికైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కి ఈ సాహస యాత్రను ప్రారంభించడం విశేషం. ఆయన గోల్ఫ్ కోర్సు నుంచి గండిపేట చెరువు వరకు సుమారు పది కిలోమీటర్ల మేర ఆకాశంలో విహరించారు. పైనుంచి నగరాన్ని వీక్షించడం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని ఇస్తుందని, ఇది పర్యాటకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకంగా మారుతుందని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.



ఈ అద్భుతమైన ప్రదర్శన మరియు రైడ్స్ నేటి నుంచి మూడు రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. కేవలం గోల్కొండ ప్రాంతమే కాకుండా, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ కూడా ఈ పండుగ వాతావరణంతో కళకళలాడుతోంది. అక్కడ సుమారు పదిహేను హాట్ ఎయిర్ బెలూన్లను సందర్శకుల కోసం అందుబాటులో ఉంచారు. ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్న వందలాది మంది పర్యాటకులు ఈ ఆకాశ విహారం చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. పరేడ్ గ్రౌండ్స్ అంతా జనసందోహంతో మరియు రంగురంగుల బెలూన్లతో నిండిపోయింది.

ఈ ఉత్సవానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించేలా విదేశీ పైలట్లను, బెలూన్లను రప్పించారు. ఫ్రాన్స్, యూకే, జర్మనీ, బెల్జియం వంటి వివిధ దేశాల నుంచి సుమారు పద్దెనిమిదికి పైగా అంతర్జాతీయ బెలూన్లు ఈ వేడుకలో పాలుపంచుకుంటున్నాయి. విదేశీ నిపుణులు ఈ బెలూన్లను నడుపుతుండటం వల్ల భద్రత విషయంలో పర్యాటకులకు నమ్మకం కలుగుతోంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ ఫెస్టివల్ నిర్వహించడం తెలంగాణ పర్యాటక శాఖ సాధించిన ఒక గొప్ప విజయంగా చెప్పవచ్చు.

తెలంగాణ వారసత్వ సంపదను, ప్రకృతి రమణీయతను ఆకాశం నుంచి వీక్షించేందుకు ఇదొక అరుదైన అవకాశం అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా విదేశీ పర్యాటకులను ఆకర్షించవచ్చని ఆయన చెప్పారు. ఈ తరహా కార్యక్రమాలు కేవలం వినోదం కోసమే కాకుండా, రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులను మరియు పర్యాటక ఆదాయాన్ని తీసుకురావడానికి ఎంతగానో దోహదపడతాయని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది.

పర్యాటకుల భద్రత విషయంలో అధికారులు ఎక్కడా రాజీ పడటం లేదు. ప్రతి రైడ్ నిపుణులైన పైలట్ల పర్యవేక్షణలో, అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నిర్వహిస్తున్నట్లు టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి వివరించారు. గాలి దిశను మరియు వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఈ బెలూన్లను గాలిలోకి వదులుతున్నారు. సాహస క్రీడ అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల చిన్నారులు కూడా భయం లేకుండా ఈ ఆకాశ విహారాన్ని ఆస్వాదించగలుగుతున్నారు.

నగరవాసుల్లో ఈ వేడుక పట్ల విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఈ అద్భుత దృశ్యాలను చూసి మురిసిపోతున్నారు. గాలిలో తేలియాడే బెలూన్ల ముందు నిలబడి సెల్ఫీలు తీసుకుంటూ, వీడియోలు చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. గతంలో ఇలాంటి సాహస అనుభూతుల కోసం విదేశాలకు లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు మన హైదరాబాద్‌లోనే అటువంటి అవకాశం లభించడం పట్ల వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఫెస్టివల్ కేవలం వినోదానికే పరిమితం కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తోంది. వందలాది మంది పర్యాటకులు తరలిరావడంతో పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు పుంజుకున్నాయి. విదేశీ పైలట్లు మరియు ప్రతినిధుల రాకతో హైదరాబాద్ గ్లోబల్j సిటీగా తన ముద్రను మరోసారి చాటుకుంది. సంప్రదాయబద్ధంగా జరిగే పతంగుల పండుగకు ఈ ఆధునిక బెలూన్ ఫెస్టివల్ తోడవ్వడం వల్ల పండుగ సందడి రెట్టింపు అయ్యింది.

మొత్తానికి, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం నగర పర్యాటక ముఖచిత్రాన్ని మార్చివేసింది.

# రానున్నది కేసీఆర్ పాలనే




- **బీ.ఆర్.ఎస్ హాయంలోనే అనందంగా ప్రజలు**
- **మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్**

**విశాలభారతి, గోదావరిఖని:**

10 ఎళ్ల బీ.ఆర్.ఎస్ పాలనలోనే తెలంగాణ ప్రజలంతా అనందంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో తెలంగాణ రాష్ట్రం మళ్లీ అభివృద్ధికి దూరమవుతుందని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ పదేళ్ల కాలం పాలనలో అభివృద్ధిలో పరుగులు తీస్తే రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలోనే అభివృద్ధిలో వెనుకకు వెళ్లి పోయిందని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం గోదావరిఖని చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే, బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి గాలి పాటలను ఎగురవేస్తూ కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులతో కలిసి గాలిపటాలను గాల్లోకి ఎగురవేస్తూ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్రాంతి పర్వదినాన ఉత్తరాయణం లోకి సూర్యుడు ప్రవేశిస్తారని, ఆ సూర్యుడి కిరణాలు మనపై పడితే ఆరోగ్యవంతులు అవుతామని అన్నారు. సంక్రాంతి పర్వదినాన పిల్లలు, పెద్దలు అంతా గాలి పాటలను ఎగురవేస్తూ సంతోషంగా సంబరాలను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. గత 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో ప్రజలంతా సంక్షేమ పథకాలను పొందుతూ సంతోషంగా ఉన్నారని కానీ నేడు కాంగ్రెస్ పాలనలో రామగుండం ప్రజలు భయంతో బతుకుతున్నారని తెలిపారు. ఇక రానున్నది మళ్ళీ బీ.ఆర్.ఎస్ పాలనేనని ప్రజలకు మంచి రోజులు వస్తాయని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా బీ.ఆర్.ఎస్ కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిమ్మిబాబు బుర్రి వెంకటేష్ నూతి తిరుపతి, కిరణ్ జీ, మెతుకు దేవరాజు, సట్టు శ్రీనివాస్, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మున్సిపాలిటీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**మొయినాబాద్, విశాలభారతి:**



మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కెపల్లి వార్డులో రూ.1 కోటి 17 లక్షల 90 వేల నిధులతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మూర్తోజీగూడ వార్డులో రూ.1 కోటి 19 లక్షల 6 వేల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన జరిగింది. సురంగల్ వార్డులో రూ.85 లక్షల 20 వేల నిధులతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. అదేవిధంగా మొయినాబాద్ పట్టణంలో రూ.1 కోటి 90 లక్షల 20 వేల వ్యయంతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. పెద్దమంగళారం వార్డులో రూ.1 కోటి 92 లక్షల 60 వేల నిధులతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. అప్పోజీగూడ వార్డులో రూ.95 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. చిలుకూరు వార్డులో రూ.1 కోటి 41 లక్షల నిధులతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడితే ప్రజలకు మౌలిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని అన్నారు. అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినుద్దీన్, మున్సిపల్ మేనేజర్ జమీల్, డి ఈ పురుషోత్తం రావు, టి పి సి సి కరవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, మాజీ జెడ్పిటిసి కాలేజ్ శ్రీకాంత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎంకేపల్లి అమర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద మంగళారం మల్లారెడ్డి. రామకృష్ణ గౌడ్ హనుమంత యాదవ్ సరికొండఅనంతరెడ్డి మునగాల రవీందర్ రెడ్డి సురంగల్ గడ్డం వెంకట్ రెడ్డి జైపాల్ రెడ్డి ఈగ రవీందర్ రెడ్డి,భాస్కర్ చారి. యాదగిరి చారి, శ్రీశైలం యాదవ్, చంద్రయ్య, రమేష్, అశోక్ రెడ్,డి అధికారులు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది



**దేవరుప్పుల, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్.అలైవ్.. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లోని సిబ్బంది తమ యొక్క వాహనాలలో క్షేమంగా ఇంటి నుంచి బయలుదేరి అదేవిధంగా క్షేమంగా మళ్ళీ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరిస్తూ త్రిబుల్ రైడింగ్ చేయకుండా, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకుండా క్షేమంగా మళ్ళీ ఇంటికి చేరే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది అందరూ కూడా విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని దేవరుప్పుల మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహ్మద్ అశ్వక్ అహ్మద్, ఎస్సై ఊర సృజన్ కుమార్, ఆర్ఐ రాజు, కార్యాలయ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఘనంగా సన్మానం



**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ భార్ అసోసియేషన్. ఆధ్వర్యంలో ఇటీవల బోధన్ ఐదవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఏరాజ్ పల్లి గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ ముస్కు గంగారెడ్డి , మరియు బోధన్ అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ కు, బోధన్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది శ్రీ సిహెచ్ వి హనుమంతరావు లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది, ఈ యొక్క పదవి నేటి నుండి మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుందని ఉత్తర్వులలో పేర్కొన్నబడినది, ఈ సందర్భంగా బోధన్ న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు శ్రీ బి. రాములు, మరియు సభ్యులు యం.గంగారెడ్డి, సిహెచ్ వి హనుమంతరావు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఘనంగా సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మరియు జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు

- **రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ లో డ్రా**
- **జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి**




**నిజామాబాద్, విశాలభారతి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు భీంగల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీల వార్డులకు మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 17న (శనివారం) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ డ్రా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీకి సంబంధించిన వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.00 గంటలకు డ్రా నిర్వహిస్తామని అన్నారు. అదేవిధంగా ఆర్మూర్ మున్సిపాలిటీ వార్డుల ఖరారుకై ఉదయం 10.15 గంటలకు, బోధన్ మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.30 గంటలకు, నిజామాబాద్ నగర పాలక సంస్థ డివిజన్లలో మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 11.00 గంటలకు డ్రా ప్రక్రియ కొనసాగుతుందని సూచించారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి

- **పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**

**విశాలభారతి, పెద్దపల్లి:** ఏదైనా పనిమీద వాహనదారుడు ఇంటి నుంచి బయటికి వెళ్లి సురక్షితంగా ప్రాణంతో గమ్య స్థానానికి చేరుకోవడం లేదా తిరిగి ఇంటికి చేరుకోవాలి అనేది ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లి పురపాలక సంఘంలోని ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనేనని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లు మరియు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలి అని సూచించారు. ఇవి చిన్న నియమాలుగా కనిపించినప్పటికీ, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే కీలక భద్రతా చర్యలని డీసీపీ వివరించారు. అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని డీసీపీ పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ, జి.కృష్ణ,ఆకుల వెంకటేష్ మునిసిపల్ కమిషనర్ పెద్దపల్లి.పెద్దపల్లి సీఐ, కె. ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ, బి. అనిల్ కుమార్, పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ , జె. లక్ష్మణ్ రావు లు పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అరైవ్ అలైవ్ ముఖ్య లక్ష్యమే సురక్షిత ప్రయాణం



**రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**

**విశాలభారతి, గోదావరిఖని:**

రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రజల వాహనదారుల ప్రాణాల రక్షణే ముఖ్య ఉద్దేశ్యం తో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అరైవ్,అలైవ్ కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మార్గదర్శకత్వంలో, డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, విద్య, రోడ్డు రవాణా, ఆరోగ్య, ఆర్ అండ్ బి శాఖ, తదితర శాఖల అధికారులు,ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి,ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అరైవ్,అలైవ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో సమన్వయం చేస్తున్నామని సీపీ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడాది 30 శాతం ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అందులో భాగంగా మున్సిపల్, విద్య, ఆరోగ్య, రోడ్డు రవాణా, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పై అవగాహన కల్పించేలా చొరవ చూపాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్రైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సమన్వయము తో అవగాహన కల్పించడం జరుగుతుంది అని ఇందుకోసం ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు.అలాగే ప్రతి వాహనదారుడి వద్ద డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ వంటి వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఇవి చట్టపరంగానే కాకుండా ప్రమాద సమయంలో ఆర్థిక భద్రతను కూడా కల్పిస్తాయని సీపీ వివరించారు.ప్రభుత్వ ఉద్యోగులకు సిపి హెల్మెట్ లను పంపిణీ చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామును ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు,ఎం ఇ ఓ మల్లేష్, సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. కృపా భాయ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ సీఐ ప్రదీప్ సాగర్,రోడ్లు & భవనాల శాఖ ఎస్ ఐ రమేష్, అనూష, ట్రాఫిక్ ఎస్ ఐ లు హరిశేఖర్, రామరాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **ఇఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్**
- **తొమ్మిది నెలలుగా నిరంతర సేవలు.. ఇకపై ప్రజా పోరాటాలకు సిద్ధం**
- **పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటా**



**చౌటుప్పల్, విశాలభారతి:**

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ స్పష్టం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన తొమ్మిది నెలలుగా, ఏప్రిల్ 14, 2025 అంబేద్కర్ జయంతి నుంచి జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ తరపున నిరంతర సామాజిక సేవలు అందిస్తున్నని తెలిపారు. కేవలం సేవా కార్యక్రమాలతోనే అన్ని సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు చేరువగా ఉండి సమస్యలు పరిష్కరించేందుకు చౌటుప్పల్‌లో త్వరలో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.ఇటీవల నాంపల్లి మండలం దామెర గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడ గత పదేళ్లుగా దామెర గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా, ఇంకా ఫ్లోరోసిస్ భూతం జిల్లాను వదలడం లేదన్నారు.నేటికీ ఫ్లోరోసిస్ నీటితోనే పంటలు పండుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎంతోమంది అర్హులైన వృద్ధులకు కనీసం పెన్షన్లు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం అండగా ఉంటానని తెలిపారు. మీ ఊరిలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కోసం అవసరమైతే అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడతానని, ఒకవేళ ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రజల తరపున పోరాటం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల కోసం నేను ఎక్కడికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నా శక్తి మేరకు సమస్యలను పరిష్కరిస్తా లేని పక్షంలో ప్రభుత్వం నుండి సాధించుకునే వరకు పోరాడుదామని తెలిపారు.మన బతుకులు బాగుంటేనే, మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు.రాజకీయ పదవి ఉన్నా లేకున్నా,ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటానని ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన నాయకులు ఐదేళ్ల పాటు వారి సొంత ప్రయోజనాల కోసం, వారి అభివృద్ధి కోసమే చూసుకుంటున్నారు తప్ప, ఓట్లేసిన ప్రజల కోసం ఏమీ చేయడం లేదని ఆరోపించారు.

## జైపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

**సికింద్రాబాద్, విశాలాభారతి:**

మాజీ కేంద్ర మంత్రి ఉత్తమ పార్లమెంట్ సభ్యుడిగా అవార్డు స్వీకరించిన ఎస్. జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా రవి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ వారి యొక్క ఆదర్శాలను రాజనీతిని ఆదర్శంగా తీసుకోవాలని తెలుపుతూ శుక్రవారం నెక్లెస్ రోడ్ లో గల వారి సమాధి వద్ద బీ.సీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, అజయ్ నాయుడు తో కలిసి నివాళులర్పించడం జరిగింది.




## ఫేక్ లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**కురవి ఎస్సై గండ్రాతి సతీష్ కుమార్**



**కురవి విశాలభారతి:** కురవి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కురవి సబ్ ఇన్స్పెక్టర్ గండ్రాతి సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల వాట్సాప్ గ్రూపులలో "లింక్ షేర్ చేస్తే ఐదు వేల రూపాయలు వస్తాయి" అంటూ సందేశాలు విస్తృతంగా ప్రచారం అవుతున్నాయని తెలిపారు. ఇలాంటి లింకులు పూర్తిగా నకిలీవి కావడంతో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నూ వాటిని నమ్మకూడదని సూచించారు. ఈ ఫేక్ లింకులపై క్లిక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వ్యక్తిగత సమాచారం వెళ్లే ప్రమాదం ఉందని, ఫోన్లు హ్యాక్ అయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. ఈ లింకుల ద్వారా ఎలాంటి డబ్బులు రావని, మోసపూరితంగా ప్రజలను మభ్యపెట్టేందుకు సైబర్ నేరగాళ్లు ఈ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అనుమానాస్పద ఇలాంటి సందేశాలను ఇతర గ్రూపులకు ఫార్వర్డ్ చేయకుండా వెంటనే తొలగించాలని కోరారు. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండి, సైబర్ మోసాలకు గురి కాకుండా సహకరించాలని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు



**మొయినాబాద్, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన, సంక్షేమ పథకాల అమలు నచ్చి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు యండి అన్వార్ ఖాన్, యండి నూర్ బాయ్ టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్,పల్లగుల్ల అశోక్ యాదవ్, సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగ యండి అన్వార్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రజాధరణ పొందుతూ సుస్థిర అభివృద్ధికై పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో బంగారు తెలంగాణ దిశగా అడుగులేస్తున్న చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చేరగు రామ కృష్ణ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, ఈగ రవీందర్ రెడ్డి,యాలాల జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్, హన్మంత్ యాదవ్, బేగరి రాజు, కొత్తపల్లి విక్రమ్ రెడ్డి, కమ్మరి యాదగిరి చారి,బండారి చెంద్ర రెడ్డి, యండి మహీబ్ బాయ్, తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలి

- **చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య సంక్రాంతి శుభాకాంక్షలు**
- **తెలిపిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అమర్నాథ్ రెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** తెలుగు సాంస్కృతి సాంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ఎంతో ఆనందాన్నిస్తుందని, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎంకేపల్లి మాజీ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి చంద్రయ్య శ్రీశైలం టిపిసిసి కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్ లు కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్యకు పూల మొక్కల అందజేశారు. ఈ సందర్భంగా కాలే యాదయ్య మాట్లాడుతూ.. పండుగలు అందరూ కలిసి జరుపుకున్నప్పుడే ఆనందంగా ఉంటాయని కాల యాదయ్య తెలిపారు. సంతోషంగా తెలుగు సాంప్రదాయ సాంస్కృతులకు భిన్నంగా సంక్రాంతి పండుగను మూడు రోజులపాటు ఇంటి ముందు మహిళలు వేసే ముగ్గులు యువకుల పతంగులు ఎంతో సంతోషాన్ని ఇస్తాయని తెలిపారు. పండుగ వేళలో అందరూ సంతోషంగా ఉండాలని తెలిపారు. కలిసిమెలిసి పండగలు జరుపుకుంటేనే ఆ పండుగలు ఎంతో ఆనందంతోపాటు సంతోషాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

- **బండి నాగేశ్వరరావు**



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన కలకొండ సైదయ్య,షేక్ లతీఫ్ భాష లు ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతి మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బండి నాగేశ్వరరావు సైదయ్య, షేక్ లతీఫ్ భాషల మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.సైదయ్య కుటుంబానికి 5 వేలు, షేక్ లతీఫ్ భాష కుటుంబానికి 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.వారి కుటుంబాలకు అండగా ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బండి నరసింహారావు,కోరబోయిన రామయ్య,రామంజి,కొట్ర జయానందరావు,కలకొండ దుర్గ ప్రసాద్,కొట్ర కృష్ణ,నారబోయిన గోపి,కలకొండ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బంజర మల్లన్నకు ఘనంగా పూజలు

**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం బంజర గ్రామంలో ఉన్న ప్రసిద్ధ మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రంలో భోగి పండుగ సందర్భంగా బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిసీపి రాజ మహేంద్ర నాయక్, ఏసీపి అంబటి నరసయ్య, సీఐ జానకి రామ్ రెడ్డి, ఎస్ఐ సృజన్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి బందోబస్తు ప్రణాళికపై సమగ్రంగా పరిశీలన చేశారు. జాతర ప్రశాంతంగా శాంతిభద్రతలతో నిర్వహించేందుకు పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు నిఘా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జాతర నిర్వాహకులు జోగు బిక్షపతి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా బంజర గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో జాతరను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ జాతరకు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ కోరికలు తీర్చుకుంటూ మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. ఈ ఆలయాన్ని సుమారు 195 సంవత్సరాల క్రితం తమ తాత జోగు గౌరప్ప నిర్మించి మట్టి విగ్రహాలతో మల్లికార్జున స్వామిని ప్రతిష్టించి పూజలు ప్రారంభించారని చెప్పారు. భోగి రోజు బోనాల కార్యక్రమం, సంక్రాంతి రోజు ప్రధాన జాతర ఘనంగా నిర్వహించ బడుతుందని తెలిపారు. ఆలయాల్లో రాతి విగ్రహాలతో పూజలు నిర్వహిస్తే ఇక్కడ మాత్రం ప్రత్యేకంగా పుట్టమన్నుతో తయారుచేసిన విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలను చేయుడు ప్రత్యేకతగా పేర్కొన్నారు. మహిమగల మల్లికార్జున స్వామి భక్తులకు కోరికలు తీర్చే దేవుడని ఈ జాతర భక్తులందరికీ సుఖసంతోషాలు అందిస్తోందని నిర్వాహకులు జోగు బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగు సోమయ్య, నరసయ్య, కైలాసం, కొమురయ్య, నరసింహ, కుమార్, పాండు, రాములు, మల్లేష్ గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని గోదావరి నది తీరాన ఉన్న సమ్మక్క సారాలమ్మ జాతర ఏర్పాట్ల పనులను శుక్రవారం అర్జీ వన్ జియం లలిత్ కుమార్ తో కలసి పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గోదావరి తీరన నిర్వహించిన సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పతంగులు ఎగిరేసి పండుగ వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులతో, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామి గుడి సాధన కమిటీ ఎన్నిక

- చైర్మన్ సామ రామిరెడ్డి
- వైస్ చైర్మన్ తుమ్మల వెంకటరెడ్డి



**చిట్యాల, విశాలభారతి:** మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి గుడి నిర్మాణం కోసం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామి గుడి చైర్మన్గా సామరాంరెడ్డి వైస్ చైర్మన్గా తుమ్మల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .ఈ కార్యక్రమంలో బండారు లింగారెడ్డి, కొమురెల్లి మోహన్ రెడ్డి,సా మహేందర్ రెడ్డి,బిలపాటి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల శ్రీకాంత్ రెడ్డి, బండారు భరత్ రెడ్డి,కొమురెల్లి సంతోష్ రెడ్డి, బిలపాటి ప్రశాంత్ రెడ్డి,కొంతం రవీందర్ రెడ్డి,తుమ్మల లక్ష్మారెడ్డి,సింగిరెడ్డి గోపిరెడ్డి, సింగిరెడ్డి అనంతరెడ్డి, బిల్లుపేట రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం నూతన కమిటి ఎన్నిక

- నూతన అధ్యక్షునిగా తుమ్మల వెంకట్ రెడ్డి

**చిట్యాల, విశాలభారతి:** మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో రెడ్డి సంఘం సమావేశం మాజీ అధ్యక్షులు గెలపాటి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రెడ్డి సంఘం నూతన అధ్యక్షులుగా తుమ్మల వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శిలుగా బండారు లింగారెడ్డి,తుమ్మల లక్ష్మారెడ్డి, కోశాధికారిగా సామ సితరామిరెడ్డి బిల్లపాటి రోషిరెడ్డి,కొంతం బాల్రెడ్డి,సింగిరెడ్డి ప్రతాపరెడ్డి,దేవరపల్లి సత్తిరెడ్డి,బిలపాటి నర్సిరెడ్డి,ముడుపు నరేష్ రెడ్డి,దేవరపల్లి మల్లారెడ్డి,సింగిరెడ్డి శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సామ మహేందర్ రెడ్డి,తుమ్మల నాగరాజు రెడ్డి ,బండారు ప్రభాకర్ రెడ్డి,సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి,బిలపాటి శ్రీనివాసరెడ్డి,సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల వెంకటరెడ్డి, బండారు మధుసుదన్ రెడ్డి, సింగిరెడ్డి గోపిరెడ్డి,సింగిరెడ్డి అనంతరెడ్డి,తుమ్మల మధుసూదన్ రెడ్డి,తుమ్మల శ్రీకాంత్ రెడ్డి, దేవరపల్లి దినేష్ రెడ్డి,తుమ్మల కృష్ణ రెడ్డి,కొమురెల్లి సంతోష్ రెడ్డి,సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,బండారు జానారెడ్డి,కొమురెల్లి అనిల్ రెడ్డి, సింగిరెడ్డి బాల్రెడ్డి,బండారు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు మద్దతుగా మహిళా సంఘాలు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ కు,ప్రజాపాలనకు మద్దతుగా భారీ ఎత్తున మహిళా స్వయం సహాయక సంఘాలు బోథ్ మండల వ్యాప్తంగా బయలుదేరారు ఈ సందర్భంగా ధన్నూర్ (బి) గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి బహిరంగ సభకు శ్రేణులను తరలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్ రెడ్డి గారు బాధ్యతలు తీసుకున్న తర్వాత మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని ఆ దిశగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, పంట కొనుగోలు వంటి ఎన్నో పథకాలు ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైపు మహిళా సంఘాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తెలిపారు.ఈ కార్యక్రమంలో ధన్నూర్ బి గ్రామ ఉపసర్పంచ్ కారం సుజాత, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# యువతకు క్రీడలు ఎంతో అవసరం

- కాంగ్రెస్ మండల సమన్వయ కమిటి సభ్యులు కరుణాకర్ రెడ్డి

**కేశంపేట,విశాలభారతి:** నేటి ఆధునిక యుగంలో పిల్లలకు మొబైల్ ఫోన్ లే ప్రపంచం అయ్యాయని ఇలాంటి సమయంలో యువతకు క్రీడలు ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటి సభ్యులు బీస కరుణాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా నిర్వహించిన తొమ్మిది రేకుల ప్రీమియం లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన టీమ్ లకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. యువకులు అన్ని రంగాల్లో ముందుండాలని,యువతరం అనుకుంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు.మొదటి బహుమతి అమిగోస్ టీంకు 20వేల రూపాయలు సర్పంచ్ బీస కవితకరుణాకర్ రెడ్డి, రెండవ బహుమతి ఇలేట్ ఈగల్ టీం కు 15వేలు రూపాయలు ఉప సర్పంచ్ వుద్యవత్ రవి నాయక్, గ్రౌండ్ నిర్వహణకు 10వేలరూపాయలు ఏనుక శ్రీకాంత్ రెడ్డిలు అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొగుల భీమయ్య,వెంకట్ రెడ్డి, నర్సింహారెడ్డి,గుత్తి శేఖర్ ,లాలమెని చంద్రయ్య,కల్వకోలు నిరంజన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ గౌడ్, వార్డు సభ్యులు పోగుల నరేష్, పోగుల నర్సింలు, నిర్వాహకులు కానుగుల గణేష్, బీస సంజీవరెడ్డి, బీస ప్రశాంత్ రెడ్డి, పోగుల శివకుమార్ ,శివ సురేష్, శీను, తదితరులు పాల్గొన్నారు.



# డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం

- మైనర్లకు బైకులు ఇవ్వద్దు
- త్రిబుల్ రైటింగ్ చేయవద్దు
- బండి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి
- బండికి నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలి
- హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయవద్దు
- అధిక స్పీడ్ తో డ్రైవింగ్ చేయకూడదు
- డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్ఐ స్వప్న



**భద్రాచలం, విశాలభారతి:**

భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నందు పట్టణ ఎస్ఐ స్వప్న ఆధ్వర్యంలో డ్రైవింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్సై స్వప్న మాట్లాడుతూ మైనర్లకు వాహనాన్ని నడిపేందుకు తల్లిదండ్రులు కానీ స్నేహితులు గాని ప్రోత్సహించొద్దని అలా చేస్తే చట్టరీత్యా నేరమని ఆమె పేర్కొన్నారు . అధిక స్పీడు పోవడం వలన ప్రమాదాలు జరుగుతాయని అలాగే త్రిబుల్ రైడింగ్ చేయటం వలన ప్రమాదాలకు నెలవుగా ఉన్నందున త్రిబుల్ రైటింగ్ కూడా చేయకూడదని ఆమె అన్నారు. బైకులకు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని అది లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆమె వివరించారు .రోడ్డుపై నిదానంగా వెళ్లాలని అధిక స్పీడు వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని రోడ్లమీద బైక్ రైడింగ్ చేస్తున్నప్పుడు చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి బండికి నెంబర్ కలిగి ఉండాలని నెంబర్ లేని బండిని నడపవద్దని , డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా తలపై హెల్మెట్ ధరించాలని దాని వలన ప్రమాదాల నుండి తప్పించుకునే అవకాశం ఉంటుందని తలకి గాయం కాకుండా ఉండేందుకు హెల్మెట్ సహాయ పడుతుందని హెల్మెట్ ని విధిగా ఉపయోగించాలని ఆమె పేర్కొన్నారు .మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెల్మెట్ లేనియెడల వారి పైన కూడా చర్యలు తప్పదని అలాగే త్రిబుల్ రైటింగ్ కూడా చట్టరీత్యా నేరమని అలా చేయకుండా ఉండాలని ,అధిక స్పీడు నడిపే బండ్లపైన పోలీస్ వారు నిఘా ఉంటుందని వాహనదారులు రోడ్డు రవాణా సంబంధిత భద్రత చర్యలు తీసుకొని ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనాలు నడపాలని ,పోలీసు వారికి సహకరించి ప్రమాదాలు జరగకుండా ఎవరికివారు తగు జాగ్రత్తలు తీసుకొని రోడ్ల పైన ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె అవగాహన కల్పించారు ఈ అవగాహన కార్యక్రమంలో భద్రాచలం పట్టణ పోలీస్ బృందం వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలి



- ఆర్డీఓ ఎస్ రాజేష్ కుమార్
- ట్రాఫిక్ రూల్స్ తెలియకుండా వాహనాలు నడుపొద్దు

**కీసర, విశాలభారతి:**

కీసర తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు సేఫ్టీ పై అవగాహన సదస్సు నిర్వహించిన కీసర పోలీసులు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కీసర ఆర్డీఓ ఎస్ రాజేష్ కుమార్,తహసీల్దార్ యాదగిరి రెడ్డి.ఈ సందర్భంగా కీసర ఆర్డీఓ ఎస్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు ముఖ్యంగా రోడ్డు సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు.మనం ప్రతి రోజు ఏదో ఒక్క వార్త చూస్తూనే ఉంటున్నాం హెల్మెంట్ లేకుండా బైక్ నడిపి బైక్ స్కిట్ అయి కింద పడి చనిపోయాడు అని అలాగే అతివేగంతో యువకుడు మృతి అని ఇలా చాలా జరుగుతున్నాయి అని అన్నారు.అందుకే ట్రాఫిక్ రూల్స్ లేకుండా వాహనాలు నడపొద్దు చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపొద్దు అని తల్లిదండ్రులకు సూచించారు.ఈ సంధర్భంగా కీసర సి ఐ ఆర్కపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ మార్గదర్శకత్వంలో రాష్ట్ర స్థాయి రోడ్డు భద్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనం నడపకూడదని, మొబైల్ ఫోన్ వినియోగం చేయకూడదని,రాంగ్ సైడ్ డ్రైవింగ్,సిగ్నల్ జంపింగ్,హై బీమ్ లైట్ల వాడకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అలాగే డిఫెన్సివ్ డ్రైవింగ్,గుడ్ సమారిటన్ చట్టం,ప్రమాద సమయంలో సీపీఆర్ మరియు ప్రాథమిక ప్రాణ రక్షణ చర్యలపై పలువురికి అవగాహన చేయాలి అని కోరారు.ఈ సందర్భంగా పాల్గొన్న వారందరితో"ట్రాఫిక్ నియమాలు పాటిస్తాం, హెల్మెట్/సీట్ బెల్ట్ ధరిస్తాం, మద్యం సేవించి వాహనం నడపం,మా ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుతాం" అనే రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ డివిజన్ ఏ ఓ ఎల్ రామ్ మోహన్,నాయబ్ తహసీల్దార్ అశ్విన్,అర్ ఐ మహేందర్,ఎస్ ఐ హరి ప్రసాద్,రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి అంతా వేలేరు లోనే




- కోడిపందాలకు బారులు తీరిన తెలంగాణ జనం
- అడుగడుగునా అంతరాయాలు
- గంటల కొలది ట్రాఫిక్ జామ్
- జాతరను తలపించిన పందాల స్థావరాలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :**

సంక్రాంతి పండుగ ఆనందమంతా ఆంధ్రకు సరిహద్దుగా ఉన్న తెలంగాణ బోర్డర్ సమీపంలోని వేలేరులోనే కనిపించింది. గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వేలేరు గ్రామ శివారులో ఏర్పాటుచేసిన కోడిపందాల స్థావరాల వద్ద చెప్పితే తనివి తీరనంతగా పండగ వాతావరణం నెలకొంది. కోడిపందాల నిర్వహణకు ఆంధ్రలో ప్రభుత్వం నుండి ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో తెలంగాణకు సరిహద్దు ప్రాంతమైన కిన్నెరసాని బ్రిడ్జి సమీపంలో కోడిపందాలను ఆడేందుకు వసతులను కల్పించారు. దీంతో ఈ పందాలను ఆడేందుకు ఆంధ్ర ప్రాంతం కంటే తెలంగాణ వాసులే పెద్ద ఎత్తున పాల్గొనేందుకు జనం భారులుతీరారు. తెలంగాణ ప్రాంతమైన బూర్గంపాడు మండలానికి కూత వేటు దూరంలోనే కోడిపందాలను నిర్వహించడంతో పంద్యాగాళ్ళు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కోళ్లను బరిలో దింపి లక్షలాది రూపాయల పందేలను వేశారు. కోళ్లు బరిలోకి దిగిన తర్వాత అవి పోరాడుతున్న తీరును చూసి ఆనందంతో కేరింతలు వేశారు. తమ పుంజు గెలుస్తుంది అంటే తమ పుంజు నెగ్గుతుందని వేలాది రూపాయల పై పందేలను కాసారు. సంక్రాంతి, కనుమ రోజులలో ఇక్కడ నిర్వహించిన కోడిపందాలలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి అనడంలో ఎటువంటి సందేహం లేదని పలువురు అంటున్నారు. ఈ పందాలు నిర్వహించిన ప్రాంతంలో కోడిపందాలే కాక మద్యంతో పాటు ఇతర ఆటలు అనేకం నడిచాయి. ఈ కోడిపందాల నిర్వహణకు అత్యధికంగా తెలంగాణ ప్రాంతం నుంచి యువకులే పెద్ద ఎత్తున పాల్గొనడం మరో విశేషం.

# ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

**బాలానగర్‌లో విషాదం**



**కూకట్ పల్లి, విశాలభారతి:** కుటుంబ కలహాల నేపథ్యంలో ముగ్గురు చిన్నపిల్లలతో కలిసి ఓ తల్లి అదృశ్యమైన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 24న చోటుచేసుకుంది, వారి ఆచూకి ఇంకా లభించకపోవడంతో ఈ ఘటన కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని ఉప్పుగూడ, శివాజీ నగర్‌కు చెందిన వాగ్గా దిలీప్ కుమార్‌కు, ప్రియాంకతో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం జిత్య దీపిక (9), సుదీప్తి (7), యాష్ దేవాన్ష్ (5). ఇటీవల భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా, ప్రియాంక సెప్టెంబర్ 20న తన ముగ్గురు పిల్లలతో కలిసి బాలానగర్, గౌతమ్ నగర్‌లోని తన తండ్రి ఇంటికి వచ్చేసింది. సెప్టెంబర్ 22న దిలీప్ కుమార్ వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రియాంక వినలేదు. దీంతో పెద్దలను తీసుకువస్తానని చెప్పి దిలీప్ తిరిగి వెళ్ళిపోయారు. సెప్టెంబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో, ప్రియాంక తన ముగ్గురు పిల్లలతో కలిసి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్ళిపోయింది. రాత్రి అయినా వారు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన దిలీప్ కుమార్, బంధువులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు.

# నూతన కురుమ సంఘం కమిటీ ఎన్నిక



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం చిన్నమడూరు గ్రామంలో నూతనంగా కురుమ సంఘం కమిటీని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సంఘానికి సంబంధించిన ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించగా, గ్రామానికి చెందిన కురుమ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నూతన సంఘం ఏర్పాటు కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా కేమిడి యాదగిరి, అధ్యక్షులుగా మొటికె శ్రీహరి, ఉపాధ్యక్షులుగా గ్యాదరి. విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా నా గులపల్లి వీరాంజనేయులు, కోశాధికారిగా గాదరి చందు ఎన్నికయ్యారు. అలాగే సంఘ సభ్యులుగా మోటికె భాస్కర్, వాసర్ల అశోక్, బోరెల్లి శ్రీశైలం, గౌరిగె బాలనరసయ్య, వాసర్ల నరేష్ లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియను మొటికే ఆంజనేయులు కర్రె మల్లేష్ ల సమక్షంలో నిర్వహించగా, హాజరైన సభ్యులు అందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతూ,నూతన కమిటీ గ్రామ అభివృద్ధికి మరియు కురుమ సంఘం సంక్షేమానికి కృషి చేస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోరెల్లి శ్రీను, మొటికే శేఖర్, నరేష్, సోమయ్య, సతీష్, సిద్దులు, యాకన్న, అనిల్, వినయ్, కొమురయ్య, గౌరిగె ఉప్పలయ్య, నరేష్, బీరయ్య, యాదయ్య, కొలుపుల అనిల్, జిట్టె శ్రీశైలం, కొలుపుల హరికృష్ణ, జిట్టె ఉదయ్, మహేందర్, కార్తీక్, మర్తిక్, తుప్పతి వినయ్,వాసర్ల చందు, కొలుపుల గణేష్, గ్యాదరి అజిత్, మరియు కురుమ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భోగి పండుగ సందర్భంగా ఆటలు, ముగ్గుల పోటీలు



**జనగామ జిల్లా, విశాలభారతి:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భోగి రోజున దేవరుప్పుల మండలం, సింగరాజు పల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకుడు కత్తుల సోమిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలు మరియు ఆటల పోటీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు, యువతులు,చిన్నారులు హాజరై ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా కత్తుల సోమిరెడ్డి మాట్లాడుతూ, ముగ్గులు వేయడం మన సంస్కృతిలో ఒక భాగమని,భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా మహిళలకు సంప్రదాయ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఆటల వలన విద్యార్థుల మనోధైర్యాన్ని ఆరోగ్య రీత్యా అభివృద్ధి చెందడానికి శుభ సూచికలు అని తెలిపారు.ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,బిఆర్ఎస్ నాయకులు,యువజన నాయకులు,గ్రామ నాయకులు,గ్రామ పెద్దలు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# రహదారి గుంట పూడ్చిన పిడిఎస్యూ నేత బానోత్ దేవేందర్



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా నుండి బయ్యారం వెళ్లే ప్రధాన రహదారిపై బంచరాయితండ ప్రాథమిక పాఠశాల కాటం సమీపంలో ఏర్పడిన భారీ గుంట వాహనదారులకు ప్రాణాపాయం కలిగించే స్థాయికి చేరింది. రోజూ వచ్చేటి-పోయేటి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఆ గుంటలో పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గమనించిన పిడిఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ స్వయంగా ముందుకు వచ్చి, బస్తాల్లోని పెంకు ముక్కలను తెప్పించి ఆ గుంటను పూడ్చివేయించారు. అధికారుల నిర్లక్ష్యానికి ఎదురుగా నిలిచి, ప్రజల భద్రతే లక్ష్యంగా చేసిన ఈ చర్య అందరి మనసులను ఆకట్టుకుంది. అలాగే పెద్దతండ గ్రామానికి చెందిన శ్రీను, వీరేందర్ లతో పాటు గ్రామస్తులు దేవేందర్‌కు తోడ్పడి గుంటను పూర్తిగా పూడ్చివేశారు. వారి సామూహిక ప్రయత్నంతో తాత్కాలికంగా అయినా వాహనదారులకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, "అధికారులు పట్టించుకోని సమస్యను ఒక యువ నాయకుడు స్వయంగా పరిష్కరించడం అభినందనీయం. ఇదే నిజమైన ప్రజాసేవ" అంటూ బానోత్ దేవేందర్‌ను ప్రశంసించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే రహదారి సమస్యలను వెంటనే శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత శాఖలపై గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# ఖమ్మం సభకు వేలాదిగా తరలిరావాలి

**సీపీఐ నేతల పిలుపు**

**విశాలభారతి,అబ్దుల్లాపూర్ మెట్టు :** సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగ సభకు వేలాది మంది తరలిరావాలని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాది రెడ్డి మాట్లాడుతూ.. శత జయంతి ముగింపు సభను విజయవంతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలకు ఖమ్మం సభ దిశానిర్దేశం చేయనుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మేరా హరి సింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహతో పాటు సైదులు ముదిరాజ్, సుధాకర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో బేబీ మరణం


- వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటున్న తల్లిదండ్రులు
- ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లోహృదయ విధారకర సంఘటన
- బేబీని పొట్టన పెట్టుకున్నారని కుటుంబీకుల ఆవేదన
- ఆపరేషన్ చేయమని చెప్పిన వినని డ్యూటీ డాక్టర్
- డ్యూటీ డాక్టర్లు నర్సులు నిర్లక్ష్యంపై సూపర్నెంట్ కి ఫిర్యాదు
- విచారణ చేస్తానని సూపర్డెంట్ రామకృష్ణ హామీ



**భద్రాచలం, విశాలభారతి:**

భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ 100 పడకల తో నిర్మితమై ఉన్న ఏరియా హాస్పిటల్ కి ఆదివాసులు ఎక్కువగా ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్న నేపథ్యం ఉంది ఇక్కడ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. అందులో భాగంగానే నిండు సూలాలు మొదటి కానుపు కోసం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి వచ్చామని వైద్యుల వల్ల బేబీ చనిపోయిందని బేబీ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న నా భార్యను ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి పురుడు కోసం వచ్చామని మొదటి కానుపు కావడం వలన నొప్పులు అధికం అయ్యాయని బేబీ బయటికి రాకపోవడంతో ఆపరేషన్ చేయమని కాళ్ళ ఏళ్లపడ్డానని అయినా సరే డ్యూటీ డాక్టర్లు నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తమ బిడ్డ ప్రాణాలు పోయేందుకు కారణమయ్యారని, బేబీ తండ్రి తల్లి ఆవేదన వ్యక్తపరిచారు .నొప్పులు కష్టంగా ఉన్నందున ఆపరేషన్ చేస్తే బేబీ బ్రతికే అవకాశం ఉన్నా కూడా ఆపరేషన్ చేయలేదని ఎంత చెప్పినా బూడిదలో పోసిన పన్నీరుగా చేశారని బేబీని తీసిన తరువాత కూడా బేబీ బాగానే ఉన్నదని ఇంటి లెటర్లు పెట్టమని చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు .రెండవ రోజు బేబీ చనిపోయాడని చెప్పారని వారు పేర్కొన్నారు. దీనంతటికీ కారణం డ్యూటీ డాక్టర్ అలాగే నర్సుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మరణించిందని వారు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయమని ఎంత మొరపెట్టుకున్న వినకుండా మొండిగా వ్యవహరించారని బేబీ చనిపోవటానికి కారణం డాక్టర్లు ,నర్సులేనని వారు వివరించారు. ఇట్టి విషయాన్ని సూపర్నెంట్ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని ఆయన ఫిర్యాదు చేయమన్నారని వారు తెలిపారు .ప్రభుత్వ ఏరియా సూపర్డెంట్ ముదిగొండ రామకృష్ణ కి ఫిర్యాదు చేశామని ,ఎవరైతే నిర్లక్ష్యంగా వ్యవహరించి తమ బిడ్డను చంపారో వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామని వారు అన్నారు. అలాగే ఈ విషయంపై ఐటిడిఏ పిఓ దృష్టికి తీసుకెళ్తామని వారు అన్నారు. ఇంకా ఆదివాసులకు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో సరైన వైద్యం అందట్లేదని వైద్యులు నర్సులు సెల్ ఫోన్ల తోటి ముచ్చట్లు తోటి కాలం గడుపుతున్నారని, ఎమర్జెన్సీ పేషెంట్స్ వస్తే వైద్యం అందించే దాంట్లో స్పందించట్లేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అనేకమంది ఎమర్జెన్సీ పేషెంట్లు ప్రాణాలు కోల్పోయే దాంట్లో వీరి నిర్లక్ష్యం వల్లనే జరుగుతుందని ,ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్టాఫ్ నర్సులపైన డ్యూటీ డాక్టర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకొని ఆదివాసులకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో తెచ్చేదాంట్లో కృషి చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్న బీజేపీ నాయకులు



**రాజేంద్రనగర్,విశాలభారతి:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈరోజు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్, ప్రగతి కాలనీలో రాజేంద్రనగర్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీశైలం రెడ్డిని, డివిజన్ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ అని, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే రోజుతో ప్రారంభమై భోగి, మకర సంక్రాంతి, కనుమగా మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకునే పర్వదినమని తెలిపారు. పాడి పంటలకు కృతజ్ఞత తెలుపుతూ, కొత్త ఆరంభాలకు సంకేతంగా నిలిచే ఈ పండుగలో గాలిపటాలు ఎగురవేయడం, పిండివంటలతో ఇళ్లను అలంకరించడం, గోపూజలు చేయడం వంటి సంప్రదాయాలు ఎంతో విశిష్టమని వివరించారు. అలాగే, స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఉండాలని వారు తెలపడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యతోనే పేదల జీవితాలలో వెలుగులు



**చర్ల, విశాలభారతి:** విద్య పేదల జీవితాలలో వెలుగులను నింపుతాయని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని భద్రాచలం డివిజన్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బోరా పెద్దిరెడ్డి అన్నారు.మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోలు ఆనంద భాస్కర్ జన్మదినం పురస్కరించుకొని పెద్దిరెడ్డి ఆద్వర్యంలో జన్మదిన వేడుకలు ఘణంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ది నిలయంకు 75 కేజీల బియ్యం, అంబేద్కర్ నగర్ కు చెందిన మానసిక వికలాంగురాలి కుటుంబానికి 25 కేజీల బియ్యం వితరణగా అందచేసారు. వనవాసీలో జరిగిన కార్యక్రమంలో పెద్దిరెడ్డి మాట్లాడారు. ఆనంద భాస్కర్ జన్మదినం సందర్భంగా వితరణను అందచేయడం సంతోషకరమని పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్దులకు వసతి కల్పించి వారి ఉన్నతికి వనవాసీ కృషిచేయడం అబినందనీయమని అన్నారు. ఇక ముందు కూడా సంస్దకు ఎటువంటి సహాయ సహకారాలను అందచేసేందుకు సిద్దమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనవాసీ కొమరం భీం విద్యార్ది నిలయం అద్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాద్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యులు శివరాజు కిషోర్, లవన్ కుమార్ రెడ్డి, మద్ది లక్ష్మీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## వన్నిగూడలో జోరుగున్న అక్రమ మట్టి తవ్వకాలు

- అక్రమార్కులను పట్టుకొని చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం
- తహసీల్దార్ యాదగిరి రెడ్డి

**కీసర, విశాలభారతి :**



కీసర వన్నిగూడలో జోరుగా శుక్రవారం అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు.వరుసగా మూడు రోజులు సెలవు రోజులు ఉండడంతో వన్నిగూడలో అక్రమంగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులు.ఇటీవల అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న పలువురిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించిన కీసర పోలీసులు.ఇప్పటి ఇంకా పోలీస్ స్టేషన్లో సీజ్ అయి ఉన్న ఇటాచ్ లారీలు.అయిన విచ్చల విడిగా జోరుగా అక్రమ మట్టి తరలిస్తున్నారు. కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై త్వరలోనే చట్ట పరామైన చర్యలు తీసుకుంటాము అని తెలిపారు.అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలు జరిపితే పి టి యాక్ట్ కింద అట్టి భూములను స్వాధీనం చేసుకుంటాం అలాగే పట్టా పాస్ బుక్ ను కూడా రద్దు చేస్తాము అని హెచ్చరించారు.త్వరలోనే అక్రమంగా మట్టి తరలించే వారిని పట్టుకొని వాల్టా యాక్ట్ పెట్టీ మరి చట్ట పరమైన చర్యలు చేపడుతాము అని అన్నారు.

## మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ చివరిదశ డిజైన్

### పరిశీలించిన ఉప్పల్ జోనల్ కమిషనర్



**కాప్రా, విశాలభారతి:** మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ లోని బండబావి ప్రాంతం సందర్శించి మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ చివరిదశ డిజైన్ ను ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ తో కలిసి పరిశీలించారు.

## సిఆర్‌పిఎఫ్ ఉద్యోగం సాధించిన యువకునికి సన్మానం



**కేశంపేట, విశాలభారతి:** కేశంపేట మండలపరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబనికి చెందిన రావిచేడు రాములమ్మ సత్తయ్య గౌడ్ గార్ల కుమారుడు మణికంఠ గౌడ్ సిఆర్‌పిఎఫ్ లో ఉద్యోగం సాధించాడు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ మాజీ ఉప సర్పంచ్ పంది రామ్ రెడ్డి, బాలరాజు గౌడ్, వార్డు సభ్యులు మల్లేష్, కల్వకోలు తిరుపతి లు శుక్రవారం అతన్ని శాలువాతో సన్మానించారు.దేశానికి సేవ చేయాలనే అతని సంకల్పాన్ని గ్రామస్తులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోష్క నరసింహులు, శ్రీనివాస్ గౌడ్, చాపల చంద్రయ్య, నానమోని లక్ష్మయ్య, లాలమోని ఆంజనేయులు, గోష్కంజనేయులు, పురుషోత్తం గౌడ్, నాగిల్ల బాలయ్య, కుమ్మరి యాదగిరి, తాండూరి మల్లేష్, భూషామోని కృష్ణయ్య, లాలమోని శ్రీరాములు, చాపల జంగయ్య,టి.శివకుమార్ చారి,కుమ్మరి యాదగిరి,లాలమోని యాదగిరి, పోగులకుర్మయ్య, కుమార్, శ్రీశైలం, శేఖర్, బాలకృష్ణ,గోష్కేచంద్రయ్య,బాలస్వామి గౌడ్, చాకలి నరసింహులు,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడుకు చేరుకున్న ముఖ్యమంత్రి కప్ క్రీడాజ్యోతి




**మునుగోడు, విశాలభారతి:**

గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచస్థాయికి క్రీడాకారులను తయారు చేయాలని సదుద్దేశంతో తెలంగాణ రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ జీవనం కోసం క్రీడలు అనే నినాదంతో గ్రామీణ యువతలో క్రీడల పట్ల ప్రోత్సాహాన్ని పెంపొందించడానికి జిల్లా యువజన క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కప్ క్రీడా జ్యోతి ర్యాలీ నిర్వహిస్తోంది మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోకి సీఎం కప్ టార్చ్ ర్యాలీ చేరుకోవడంతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశానుసారం ర్యాలీకి ఘన స్వాగతం పలికారు స్థానిక నాయకులు అధికారులు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి, వయస్సు తో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడుతూ శారీరకంగా మానసికంగా దృఢంగా తయారవ్వాలనే రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ముఖ్యమంత్రి కప్ క్రీడా జ్యోతి ర్యాలీకి మునుగోడు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నేలపట్ల నరేష్ నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి మునుగోడు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బీమనపల్లి సైదులు నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో మునుగోడు మండల మరియు పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి, కనుమ సంబరాలు



**విశాలభారతి, కరకగూడెం:** వేడుకల్లో పాల్గొని ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన టిపిసిసి మెంబర్ డా. చందా సంతోష్ చొప్పల పంచాయతీ చిన్న గుట్ట జాతరలో సరళమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు. కరకగూడెం మండల వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను మండల ప్రజలు గురు, శుక్ర వారాల్లో ఘనంగా జరుపుకున్నారు.. చిరుమల్ల పంచాయతీలో నిర్వహించిన ముగ్గుల పోటీలను కాంగ్రెస్ నాయకులతో కలిసి టీపీసీసీ మెంబర్ డా. చందా సంతోష్ తిలకించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే చొప్పల పంచాయతీ చిన్నగుట్ట జాతరలో పాల్గొని సారలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇదే పంచాయతీలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సావిత్రి, పొట్టయ్య, కేశవరావు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు జలగం కృష్ణ, ఎర్ర సురేష్, భుక్యరాందాస్, చందా శ్యామ్, ఈసం సత్యం, గొగ్గలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అరెం అరుణ్ కుమార్‌కి ఘన సన్మానం



**విశాలభారతి, కరకగూడెం:** మండల జేఏసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం కోయ మౌఖిక సాహిత్యంపై డాక్టరేట్ పట్టా సాధించిన అరెం అరుణ్ కుమార్‌కి కరకగూడెం మండల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం ఈరోజు కరకగూడెం మండలంలోని చొప్పాలా గ్రామంలోని సారలమ్మ గుడి ప్రాంగణంలో సారలమ్మ పూజారి ఢిల్లీ సరోజినీ సమక్షంలో ప్రత్యేకంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కరకగూడెం మండల జేఏసీ అధ్యక్షుడు పోలెబోయిన వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి తదితర జేఏసీ నాయకులు పాల్గొని అరెం అరుణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. తరతరాలుగా మౌఖికంగా కొనసాగుతున్న కోయుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను పరిశోధన రూపంలో ప్రపంచానికి పరిచయం చేసిన అరెం అరుణ్ కుమార్ కృషిని వారు కొనియాడారు. ఇది వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా మొత్తం కోయ సమాజానికి గర్వకారణంగా అభివర్ణించారు. ఆదివాసీ యువత చదువు, పరిశోధన వైపు అడుగులు వేయడానికి ఈ ఘనత ఒక ప్రేరణగా నిలుస్తుందని, కోయ మౌఖిక సాహిత్య పరిరక్షణకు ఇది కీలకమైన మైలురాయిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దేశ ఆర్ధిక వ్యవస్థలో విశ్వకర్మల పాత్ర కీలకం

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**కరీంనగర్,విశాలభారతి:** "విశ్వకర్మ బ్రాహ్మణులు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మల అభివృద్ధి, సంక్షేమం కోసం దాదాపు రూ.13 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. శుక్రవారం కరీంనగర్ లోని మొగ్దూంపూర్ లో విశ్వబ్రాహ్మణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖద్వార నిర్మాణ పనుల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరై శంకుస్థాపన చేశారు. గత 11 సంవత్సరాల్లో భారత ప్రభుత్వం విశ్వకర్మ సమాజానికి చెందిన సంప్రదాయ వృత్తిదారుల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించిందన్నారు. స్కిల్ ఇండియా, డీడీయూ జీకేవై వంటి కార్యక్రమాల ద్వారా విశ్వకర్మలకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు బండి సంజయ్ 41 డివిజన్ వావిలాలపల్లి లో కరీంనగర్ జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అట్లాగే 46వ డివిజన్ లో కేబీ బ్యాంకెట్ హాల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ కార్పొరేటర్ బండారు వేణుతోపాటు స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.



# నేనింతే..!

- ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై అధికార దుర్వినియోగం
- బెటాలియన్‌లో వెలుగులోకి వచ్చిన శ్రమ దోపిడీ
- కమాండెంట్–ఇన్చార్జ్‌ల బెదిరింపులు, వెట్టిచాకిరి ఆరోపణలు
- హైదరాబాద్‌లో కమాండెంట్ భార్య ఇంట్లో పనులకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు
- సెలవులు నిరాకరణ, అసభ్య పదజాలంతో దూషణ
- ఉద్యోగం తీసేస్తామంటూ నిరంతర బెదిరింపులు
- అధికారుల చేతుల్లో ఉద్యోగుల మానసిక క్షోభ

**సత్తుపల్లి, విశాలభారతి :**








2013 జూన్‌లో బెటాలియన్‌లలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో భర్తీ అయిన ఉద్యోగులు అప్పటి నుంచి విధుల్లో కొనసాగుతున్నారు. ఈ కాలంలో ఆరుగురు కమాండెంట్లు మారినా, ఇప్పటివరకు ఎటువంటి అసభ్యకరమైన ప్రవర్తన, బెదిరింపులు లేదా అవమానాలు ఎదురుకాలేదని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత కమాండెంట్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందని వారు వాపోతున్నారు. నోటి దురుసుతనంతో మాట్లాడటం, ఇష్టానుసారంగా పనులు చేయించడం, చెప్పిన మాట వినకపోతే ఉద్యోగం తీసేస్తానని బెదిరించడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. ఔట్సోర్సింగ్ ఉద్యోగులను చిన్నచూపుగా చూస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ, ప్రశ్నించిన వారిని టార్గెట్ చేయడం జరుగుతోందని సమాచారం. ఇక్కడే కథ తీవ్రత మొదలవుతుంది. కమాండెంట్‌కు ముగ్గురు భార్యలు ఉన్నారన్న ఆరోపణల మధ్య, మొదటి భార్య హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ స్కూల్‌కు కరస్పాండెంట్‌గా ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆ ఇంట్లో ప్రతి పది రోజులకు ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగిని పంపిస్తూ, నెలకు ముగ్గురిని చొప్పున పనిమనుషుల్లా ఉపయోగిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ప్రయాణ ఖర్చులు, అక్కడి పది రోజుల ఖర్చులు కూడా ఉద్యోగులే భరించాల్సి వస్తోందని వాపోతున్నారు.

హైదరాబాద్‌లో ఆ ఇంట్లో ఇల్లు శుభ్రం చేయడం, అంట్లు తోమడం, వంట చేయడం, కూరగాయలు కొనడం, పాలునిత్యావసర వస్తువులు తెప్పించడం వంటి పనులు చేయించారని ఆరోపణలు ఉన్నాయి. అక్కడ పనులు ఆలస్యం అయితే కమాండెంట్ భార్య దుర్భాషలాడటం, చేయి చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని సమాచారం. ఈ విషయంపై కమాండెంట్‌కు ఫిర్యాదు చేస్తే, తిరిగి ఉద్యోగులనే తిట్టడం, విధుల నుంచి తొలగిస్తానని బెదిరించడం జరుగుతోందని చెబుతున్నారు. హైదరాబాద్ రానుపోను రూ. 2000 అవుతుండగా అక్కడ పది రోజులు ఉండడానికి ఖర్చు రోజుకి 500 చొప్పున పది రోజులకు గాను ఐదు వేల రూపాయల ఖర్చు అవుతున్నాయి. ఈ చిరు ఉద్యోగులకు ఇచ్చే జీతం కేవలం 13 వేల రూపాయలు జీతం. ఈ 13 వేల రూపాయల జీతంలో హైదరాబాదుకి రూ.7,000 ఖర్చు అయితే మిగతా 6000 కుటుంబాన్ని పోషించుకోవడానికి ఖర్చు పెడుతున్నారు. "హైదరాబాద్ వెళ్లి పని చేస్తేనే ఇక్కడ ఉద్యోగం, లేదంటే లెటర్ రాసి వెళ్లిపో" అంటూ ప్రతి ఉద్యోగిని బెదిరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. హెడ్‌క్వార్టర్ ద్వారా కఠినమైన పనులు అప్పగించడం, సెలవు దినాల్లో కూడా పనులు చేయించడం, వినకపోతే ఉద్యోగం ఉండదంటూ అసభ్య పదజాలంతో దూషించడం కొనసాగుతోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇంట్లో అనారోగ్యం, అత్యవసర పరిస్థితులు ఉన్నా సెలవులు ఇవ్వకపోవడం, సెలవు రోజుల్లోనూ పిలిపించి పనులు చేయించడం తీవ్ర అన్యాయమని వారు అంటున్నారు. పోలీసు పరేడ్ సహా అనేక పనులు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల చేత చేయించుకోవడం, విధులకు మించి అదనపు పనుల భారం వేయడం సాధారణంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి.

ఔట్సోర్సింగ్ ఇన్చార్జ్‌గా ఉన్న ఏఆర్ఎస్ఐ ప్రసాద్ నాయక్, హెడ్ క్వార్టర్ ఓసి సత్యనారాయణ వీరిద్దరి పై కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగులకు విధులు, సెలవులు కేటాయించడం నుంచి హైదరాబాద్‌లో కమాండెంట్ భార్య ఇంటికి పంపించడం వరకూ అన్నీ వీళ్ళ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. కమాండెంట్‌ను ప్రసన్నం చేసుకోవడమే వీళ్ళ లక్ష్యమని, చెప్పినట్టుగా వెళ్లని వారిపై ఫిర్యాదులు చేయడం, తిట్టడం, మానసిక క్షోభకు గురిచేయడం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. తక్కువ జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటూ, నెల రోజుల పాటు కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులు తిరిగి అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లల భవిష్యత్తు ఏమవుతుందన్న భయం వెంటాడుతోందని, ఏదైనా అనుకోని ఘటన జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు.

కమాండెంట్ విధులకు సరిగా హాజరు కావడం లేదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కార్యాలయానికి రాకుండా కిందస్థాయి అధికారులను చేతుల్లో పెట్టుకొని ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారని సమాచారం. ఔట్సోర్సింగ్ కార్యాలయానికి రాకుండానే, తన అధీనంలో పనిచేస్తున్న ప్రసాద్ నాయక్ మరియు హెడ్ క్వార్టర్ ఓసి సత్యనారాయణలను చెప్పు చేతుల్లో పెట్టుకుని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై వ్యవస్థబద్ధంగా ఉసిగొలిపిస్తున్నట్టు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరూ కమాండెంట్‌ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా , ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఉద్దేశపూర్వకంగా మానసిక వేధింపులకు గురిచేస్తూ, చిన్న తప్పులను పెద్దగా చూపించి బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం.

విధుల్లో నిజాయితీగా పనిచేస్తున్న ఉద్యోగులను టార్గెట్ చేసి, వారిపై ఒత్తిడులు పెంచుతూ, కార్యాలయ వాతావరణాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు మరింత బలంగా వెలువడుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై జరుగుతున్న శ్రమ దోపిడీ, అధికార దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విశాల భారతి





# 'SYG'లో మొరటోడుగా..

సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక పానిండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'SYG' (సంబరాల యేటిగట్టు). ఐశ్వర్యలక్ష్మి కథానాయిక. రోహిత్ కె.పి దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమాకు చెందిన కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బూడిద రంగు చొక్కా ధరించి, సాంప్రదాయ పంచె కట్టుతో తెల్లటి ఆవును నడిపిస్తూ వస్తున్న సాయిదుర్గతేజ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఈ పోస్టర్ బట్టి ఇది గ్రామీణ నేపథ్యంతో కూడిన కథ అని తెలుస్తున్నది. గుబురు గడ్డం, తీక్షణమైన చూపు, చిరునవ్వు.. ఈ మూడింటితో మొరటుగా సాయిదుర్గతేజ్ కనిపిస్తున్నారు. ఈ సినిమా కోసం ఆయన కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారని, ఇప్పటివరకూ చూడని అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాలో ఆయన చేస్తున్నారని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోకనాథ్, నిర్మాణం: ప్రైమ్ షో ఎంటర్‌టైన్మెంట్స్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.